

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి బుధవారం 31-08-2022 సంపుటి : 04 సంచిక : 13 పేజీలు : 4 వెల : రూ

# కుప్పంలో ఉద్రిక్తత..

### అన్న క్యాంటీన్ ధ్వంసం, ఫ్లెక్సీలు చించివేత



చిత్తూరు జిల్లా : కుప్పంలో అన్న క్యాంటీన్ ధ్వంసం మరోసారి కలకలం సృష్టించింది. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో కుప్పంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. సమాచారం అందుకున్న టీడీపీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత వారం చంద్రబాబు పర్యటనలో అన్న క్యాంటీన్లు ధ్వంసం కాగా, ఇప్పుడు మరో క్యాంటీన్ ధ్వంసం కలకలం రేపుతున్నది. అన్న క్యాంటీన్లపై దాడి చేసి ధ్వంసం చేయడం జగన్ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. అర్ధరాత్రి సమయంలో దాడులకు తెగబడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గత 86 రోజులుగా కుప్పం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ సమీపంలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరవడాన్ని జగన్ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతున్నదని అభిప్రాయపడ్డారు. వైసీపీ హయాంలో 201 క్యాంటీన్లను రద్దు చేశారని, అన్న క్యాంటీన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నారా లోకేశ్ డిమాండ్ చేశారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా అన్న క్యాంటీన్లను కొనసాగిస్తామన్నారు. మరోవైపు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇవాళ చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. రేణిగుంట నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరి చిత్తూరు సబ్ జైలుకు వెళ్లి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాస్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలను ములాఖాత్‌లో కలుసుకుంటారు. సాయంత్రం 5.30 గంటలకు చంద్రగిరి చేరుకుని ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీడీపీ నాయకులు భాస్కర్, భాను ప్రకాష్ రెడ్డిలకు నివాళులర్పిస్తారు. పెరుమలపల్లెలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ నేత సోమనాథరెడ్డిని పరామర్శిస్తారు.

# ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

విజయవాడ, ఆగస్టు 30, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలను అధికారులు విడుదల చేశారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫలితాలను ఏకకాలంలో విడుదల చేశారు. ఇంటర్ సప్లి పరీక్షలను ఆగస్టు 3 నుంచి 12 వరకు నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం 1022 సెంటర్లలో నిర్వహించిన ఈ పరీక్షల్లో 429 మాల్‌ప్రాక్టిస్ కేసులను నమోదు చేశారు. ఇక ఉత్తీర్ణత శాతం విషయానికొస్తే ఫస్ట్ ఇయర్‌లో జనరల్ విభాగంలో 35 శాతం పాస్ కాగా వొకేషన్‌లో 42 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్‌లో జనరల్ విభాగంలో 33 శాతం, వొకేషన్‌లో 46 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోమని అధికారులు సూచించారు.



# వచ్చే నెల 11 కు 'ఛలో విజయవాడ' వాయిదా



అమరావతి : సీపీఎస్ విధానాన్ని ఎత్తివేయాలంటూ ప్రభుత్వ ఉద్యోగులు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమం వాయిదా పడింది. వచ్చే నెల 1 వ తేదీకి బదులుగా 11 న నిర్వహించేందుకు నిర్ణయించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల కారణంగా వాయిదా నిర్ణయం తీసుకున్నట్లు ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) తెలిపింది. ప్రభుత్వం అణచివేతకు గురిచేస్తూ ఇబ్బందులు పెట్టడాన్ని ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో అటు తిరుపతిలో పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. సీపీఎస్ విధానాన్ని మార్చకుండా తాత్సారం చేయడాన్ని నిరసిస్తూ వచ్చే నెల 1 న సీఎం నివాసాన్ని ముట్టడించాలని కూడా ఏపీ సీపీఎస్ఈఏ నిర్ణయించింది. దాంతో విజయవాడలో కఠిన నిబంధనలను పోలీసులు అమలుపరుస్తున్నారు. ఉద్యోగులు ఎవరు ఆందోళన చేస్తూ కనిపించినా కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ ఇప్పటికే హెచ్చరించారు. పలువురు ఉద్యోగులను, ఉద్యోగ సంఘాల నేతలను అదుపులోకి తీసుకుని 143,342,427 ,452, ఖీ/చి 120, 511 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. రాష్ట్రంలో ప్రస్తుతం పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, ఉద్యోగులు కనిపిస్తే అరెస్టులు చేస్తున్నారని ఏపీసీపీఎస్ఈఏ విచారం వ్యక్తం చేసింది. సెప్టెంబర్ 1 న చలో విజయవాడ పేరిట నిర్వహించనున్న సభ, ర్యాలీకి పోలీసుల అనుమతి కోరినా ఎలాంటి నిర్ణయం వెల్లడించకుండా సీపీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ ఇబ్బందులు సృష్టిస్తున్నదని సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. నోటీసులు జారీ చేస్తూ బైండింగ్ చేయడం వంటి ప్రతికూల పరిస్థితులు నెలకొనడంతో చలో విజయవాడను సెప్టెంబర్ 11 కి వాయిదా వేస్తున్నట్లు సంఘం నేతలు ప్రకటించారు.




# ఏపీలో 19 శాతం పెరిగిన రైతు ఆత్మహత్యలు : ఎన్‌సీఆర్‌బీ



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు గత ఏడాదితో పోలిస్తే 19 శాతం పెరిగాయి. ఈ విషయాన్ని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలోనే రైతుల ఆత్మహత్యల్లో ఏపీ మూడో స్థానంలో నిలిచింది. ఇలా మూడో స్థానంలో నిలువడం వరుసగా ఇది మూడోసారి. ఎన్‌సీఆర్‌బీ అందించిన గణాంకాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ఏడాది మొత్తం మీద వ్యవసాయ రంగానికి చెందిన 1,065 మంది తమ జీవితాలను ముగించారు. 2020లో ఈ సంఖ్య 889 గా ఉన్నది. అంటే.. ఆత్మహత్యల్లో 19 శాతం పెరుగుదల కనిపిస్తున్నది. రైతుల ఆత్మహత్యల్లో 4,064 మందితో మహారాష్ట్ర, 2,169 మందితో కర్ణాటక రాష్ట్రాలు తొలి, రెండు స్థానాలను ఆక్రమించుకున్నాయి. 2020తో పోలిస్తే 2021 లో ఆంధ్రప్రదేశ్‌లో ఆత్మహత్యలు 14.5 శాతం పెరిగాయి. 2021లో మొత్తం 8,067 మంది ఆత్మహత్యలు చేసుకోగా, 2020లో ఆ సంఖ్య 7043 గా ఉన్నది. 2021లో రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్న 1,065 మంది రైతుల్లో 958 మంది పురుషులు, 107 మంది మహిళలు ఉన్నారు. మానవ హక్కుల ఫోరం (హెచ్‌ఆర్‌ఎఫ్), రైతు స్వరాజ్య వేదిక (ఆర్‌ఎస్‌వీ) ప్రతినిధులు రాష్ట్రంలోని అనేక ప్రాంతాలను సందర్శించి.. పెరుగుతున్న అప్పులు, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ ధర లేకపోవడం, కౌలుదారుకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను విడుదల చేయకపోవడం వంటి అంశాలే రైతుల ఆత్మహత్యలకు ప్రధాన కారణమని గుర్తించారు.

# సీఎం వైఎస్ జగన్‌తో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రతినిధుల భేటీ.. ఏపీలో పెట్టుబడులపై చర్చ



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ప్రతినిధులు సీఎం క్యాంప్ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, అవకాశాలపై సీఎం వైఎస్ జగన్‌తో చర్చించారు. అలాగే.. రక్షణ వైమానిక రంగంలో తయారీ, నిర్వహణ తదితర అంశాల్లో పెట్టుబడులు, అవకాశాలపై చర్చించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ కార్పొరేట్ ఎఫైర్స్, రెగ్యులేటరీ హెడ్ జే. శ్రీధర్, టాటా ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ హెడ్ మసూద్ హుస్సేనీ ఉన్నారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అంశంలో ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా తాము సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్.

రాష్ట్రంలో పారిశ్రామికంగా అనుసరిస్తున్న పారదర్శక విధానాలను వివరించారు. సుశిక్షితులైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల్ వలవెన్, ఏపీఈడీబీ సీఈవో జవ్వాది సుబ్రహ్మణ్యం, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

# 'టీడీపీకి అసలు సిసలు అధ్యక్షుడు రామోజీరావు'

తాడేపల్లి : ఏపీ ప్రభుత్వంపై పచ్చ పత్రికలు విషపు రాతలు రాస్తున్నాయని జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. వారు విషం చిమ్ముతూ రాసే ప్రతి అవాస్తవంపై వాస్తవాలు తెలియజేస్తామని అంబటి స్పష్టం చేశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాట్లాడిన అంబటి.. టీడీపీకి అసలు సిసలు అధ్యక్షుడు రామోజీరావేనన్నారు. 'టీడీపీని వెనుక ఉండి నడుపుతున్నది రామోజీరావు. టీడీపీకి అసలు సిసలు అధ్యక్షుడు రామోజీరావు. టీడీపీలో అంతా రామోజీరావు చెప్పినట్లే జరుగుతుంది. రామోజీరావు ఆమోదం లేకపోతే టీడీపీలో ఏదీ జరగదు. టీడీపీలో ఎమ్మెల్యే టికెట్లు కూడా రామోజీరావు నిర్ణయిస్తారు. చంద్రబాబు, రామోజీరావుది



విడదీయరాని బంధం. పోలవరంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. పోలవరంలో నామినేషన్‌పై రామోజీరావు బంధువులకు పనులు ఇచ్చారు. వాటిని రద్దు చేసి పారదర్శకగా వేరే వారికి ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు' అని ధ్వజమెత్తారు అంబటి.

# ఇబ్రహీంపట్నం ఘటన దురదృష్టకరం : డీహెచ్ శ్రీనివాసరావు



హైదరాబాద్ : ఇబ్రహీంపట్నం సివిల్ ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల వికటించి. నలుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ప్రజారోగ్య సంచాలకులు శ్రీనివాసరావు స్పందించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 25న ఇబ్రహీంపట్నం ఆసుపత్రిలో కు.ని. ఆపరేషన్లు నిర్వహించినట్లు చెప్పారు. అనుభవం ఉన్న సర్జన్‌తోనే 34 ఆపరేషన్లు చేశారని పేర్కొన్నారు. ఆపరేషన్లు చేయించుకున్న వారంతా కొద్ది గంటలే ఆసుపత్రిలో ఉండాల్సి ఉంటుందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో అనుభవజ్ఞుడైన వైద్యుడి ఆధ్వర్యంలో ఆపరేషన్లు జరిగాయని చెప్పారు. ఆపరేషన్ చేయించుకున్న వారంతా కొద్ది గంటలే ఆసుపత్రిలో ఉండాల్సి ఉంటుందని.. ఆపరేషన్లు పూర్తి అయిన అనంతరం మహిళందరికీ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి ఇండ్లకు పంపించడం జరిగిందన్నారు. ఆ తర్వాత మహిళలు 26, 27 తేదీల్లో గ్యాస్ట్రో లక్షణాలపై ఫిర్యాదు చేశారన్నారు. వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించడం, అలాగే ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకోవడం జరిగిందన్నారు. ఆపరేషన్లు చేయించుకున్న 34 మందిలో నలుగురు దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇది బాధాకరమైన విషయమన్నారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఇలాంటి ఘటనలు జరుగడం మొదటిసారన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటిస్తున్నామన్నారు. ఘటనపై ఎప్పటికప్పుడు ఆరోగ్యశాఖ మంత్రి ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ మార్గనిర్దేశనం చేస్తున్నారన్నారు. అయితే, మృతి చెందిన నలుగురిని కాజ్ ఆఫ్ డెత్ కోసం నలుగురికి పోస్టుమార్టం నిర్వహించినట్లు చెప్పారు. తద్వారా మంణానికి కారణాలు తెలుసుకునేందుకు పోస్టుమార్టం ముఖ్యమన్నారు. మిగతా 30 మందిని నిన్న నుంచి స్క్రీనింగ్ చేస్తున్నామని, ఇండ్లకు ప్రత్యేక బృందాలను పంపి.. ఎప్పటికప్పుడు ఆరోగ్యంపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. 30 మందిలో సోమవారం అర్ధరాత్రి ఏడుగురిని హైదరాబాద్ ఆసుపత్రికి తరలించామన్నారు. మరో ఇద్దరు మహిళలను నిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు రెగ్యులర్‌గా జరిగే ప్రక్రియ అన్నారు. కు.ని. ఆపరేషన్లు తెలంగాణలో కాకుండా దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమన్నారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమం 70 సంవత్సరాల కిందట ప్రారంభమైందన్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు పబ్లిక్ సెక్టార్‌లో 16,147 ట్యూబెక్టమీ, ప్రైవేటు సెక్టార్‌లో 16,077 ట్యూబెక్టమీ ఆపరేషన్లు నిర్వహించడం జరిగిందన్నారు. మొత్తం 38,656 ఆపరేషన్లు జరుగుతుందన్నారు. ఇబ్రహీంపట్నం ఘటనపై ప్రభుత్వం పారదర్శకమైన విచారణ కోసం కమిటీని నియమించిందన్నారు. కమిటీకి విచారణ అధికారి డైరెక్టర్ హెల్త్‌ను నియమించిందని చెప్పారు.

# సెప్టెంబర్ 3న టీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం

హైదరాబాద్ : సెప్టెంబర్ 3న తెలంగాణ కేబినెట్ సమావేశం జరుగనున్నది. అనంతరం అదే రోజు టీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు తెలంగాణ భవన్‌లో భేటీ జరుగనున్నది. టీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్ అధ్యక్షతన సాగే ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీలు సైతం పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, నూతనంగా అమలు చేస్తున్న పెన్షన్లు, గిరిజనులకు పోడు భూములు తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం.

# సంపాదకీయం

బుధవారం 31-08-2022

## రిషిసునాక్ పదవికి అడ్డుగోడగా జాత్యాంహకారం

బ్రిటిష్ ప్రధాన మంత్రి ఎన్నికల్లో అధికార కన్జర్వేటివ్ పార్టీ నాయకత్వానికై జరుగుతున్న పోరులో మొదట్లో దూసుకుపోయిన భారత సంతతికి చెందిన అభ్యర్థి రిషి సునాక్ ఆ తర్వాత అనూహ్యంగా వెనుక పడిపోయారు. ఇప్పటికే లిజ్ ట్రస్ స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతున్నారు. బహుశా మరి కొద్దీ రోజులలో ఆమె అధికారికంగా ప్రధాని పదవి చేపట్టవచ్చు. ఎన్నికలలో ఇటువంటి జయాపజయాలు అత్యంత సహజమే. అయితే రిషి సునాక్ వెనుకబడటానికి గల కారణాలు రాజకీయమైనవి కాకుండా, వర్ణ వ్యవస్థకు సంబంధించినవని సర్వత్రా భావిస్తున్నారు. పాశ్చాత్య సమాజంలో పేరుకుపోయిన జాత్యహంకారానికి ఈ ఎన్నికలు అద్దం పడుతున్నాయని చెప్పవచ్చు. సునాక్ 'తెల్లవాడు' కాకపోవడం కారణంగా ఆ దేశపు ప్రధాని కాలేకపోతున్నారని అనడంలో సందేహం లేదు.అధికార పార్టీ ఎంపిలలో జరిగిన వివిధ పోల్‌లలో ఆయన అందరికన్నా ముందున్నారు. లిజ్ ట్రస్ మూడవ స్థానంలో ఉన్నారు. కానీ సాధారణ పార్టీ సభ్యుల ఎంపిక విషయం వచ్చేసరికి ఆమె దూసుకుపోతున్నారు. భారత దేశం సుదీర్ఘకాలం పలు విదేశీ పాలనాలను చూసింది. మిగిలిన వారంతా ఇక్కడ సంపద దోచుకోవాలని, తమ సామ్రాజ్యం ఏర్పాటు చేసుకోవాలని చూశారు. కానీ ప్రజలపట్ల జాత్యహంకారాన్ని కేవలం బ్రిటిష్ వంటి ఐరోపా దేశాల వారు మాత్రమే ప్రదర్శించారని ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. ఆనాడు భారత్‌కు స్వాతంత్ర్యం ఇవ్వడానికి తిరస్కరించడానికి ప్రధాన కారణం 'నల్లవారు' పరిపాలన చేసుకోలేరని, తాము లేకపోతే ముక్కలుగా చెల్లాచెదురైపోతారనే దురహంకార భావన. తమ మాట సాగాలని పోతూపోతూ దేశాన్ని ముక్కలు చేసి, పలు వేర్పాటు కుంపట్లు పేర్చి మరీ వెళ్లారు. రవి అస్తమించని సామ్రాజ్యం కూలిపోయినా ఇటువంటి సంకుచిత మనస్తత్వం నుండి వారింకా బైటపడలేదని ఈ ప్రధాని ఎన్నిక స్పష్టం చేస్తుంది.తెల్లవారి' సామ్రాజ్యంగా భావించే మొత్తం పాశ్చాత్య ప్రపంచం లో నలుపు, ఆసియా లేదా మైనారిటీ జాతులవారు తెల్లవారు అత్యధికంగా ఉన్న దేశాల నేతలుగా ఎన్నికైన సందర్భాలు చాలా అరుదని ఈ సందర్భంగా గమనించాలి. ఆ విధంగా ఎన్నికైనది అమెరికాలో బరాక్ ఒబామా, పోర్చుగల్ ప్రధాన మంత్రి, గోవా సంతతికి చెందిన ఆంటోనియో కోస్టా, తండ్రి భారతీయుడైన ఐరిష్ మాజీ ప్రధాని లియో వరద్కర్ మాత్రమే కనిపిస్తారు. ఆ జాబితాలో రిషి సునాక్ చేరే అవకాశం ఇప్పుడు వచ్చింది. అమెరికాలో నిత్యం నల్లవారిపై అమానుష దాడులు చూస్తున్నాము. తాజాగా నలుగురు భారత సంతతికి చెందిన మహిళలపై జరిగిన దాడి చూశాము. మొదటిసారి 'నల్లవాడు' బరాక్ ఒబామా అమెరికా అధ్యక్షుడిగా కాగలిగినా తాను అధ్యక్ష స్థానంలో ఉంటూ కూడా పలు సందర్భాలలో 'వర్ణ వివక్షత'కు గురయ్యానని ఆయనే వెల్లడించారు. ఇప్పటికీ ఆ దేశ న్యాయవ్యవస్థలో తీర్పులలో 'వర్ణ వివక్షత'ను పరిగణనలోకి తీసుకొంటున్నట్లు ఆయనే వాపోయారు.కరోనా సమయంలో రిషి సునాక్ వ్యవహరించిన తీరు చూసి ఆ దేశ ప్రజలు ఎన్నో విధాలుగా ప్రశంసించారు. కాబోయే ప్రధానిగా కొనియాడారు. ప్రస్తుతం ప్రధాని పదవికి పోటీ పడుతున్న ఇద్దరిలో సామర్థ్యం, మేధస్సు, విషయం పరిజ్ఞానం వంటి అన్ని విషయాలలో రిషి సునాక్ మొదటి స్థానంలో ఉన్నారని అందరూ అంగీకరిస్తారు. సునాక్ వెనుకబడడానికి ఆయన పన్నులు పెంచడం, ఆయన భార్య 'నాన్ ? డొమిసైల్' హోదా, కేబినెట్ మంత్రిగా ఉంటూ కూడా గ్రీన్ కార్డు కలిగి ఉండడం వంటి కొన్ని కారణాలు చెబుతున్నారు. అయితే ఆయన ఏ విషయంలో కూడా ఆ దేశంలోని చట్టాలను ధిక్కరించి వ్యవహరించక పోవడం గమనార్హం. అయితే చట్టపర అంశాలకన్నా రాజకీయ అంశాలు భిన్నమైనవి అనడంలో సందేహం లేదు. భారత దేశంలో సహితం దళితుల పట్ల ఇటువంటి వివక్ష అత్యున్నత స్థాయిలలో సహితం కొనసాగడం ఈ సందర్భంగా గమనార్హం. 1977లో జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు మొత్తం 300 మంది ఎంపిలలో సుమారు 200 మంది (జనసంఘ్, లోక్‌దళ్) జగజీవన్ రామ్ పేరును ప్రధానిగా ప్రతిపాదించారు. ఆయనను ప్రధానిగా చేసుంటే ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకొనేవారు. సమీప భవిష్యత్తులో గాంధీ కుటుంబం అధికారంలోకి రాకుండా ఆయన అడ్డుకోనేవారు. పరిపాలనా సామర్థ్యంలో ఆయన ఎవ్వరికీ తీసిపోరు. అయితే ఆయన దళితుడు కావడంతో ఆయన ప్రధాని కాలేకపోయారు. 'అభిప్రాయ సేకరణ' పేరుతో మొరార్జీ దేశాయ్‌ని ప్రధానిగా చేశారు. మొరార్జీ రాజీనామా తర్వాత తిరిగి జగజీవన్ రామ్‌కు అవకాశం వచ్చినా నాటి రాష్ట్రపతి సంజీవరెడ్డి పడనీయలేదు. దేశ చరిత్రలో మొదటిసారి ప్రధాన మంత్రి ఎవ్వరు అనే అంశంపై జరిగిన 1980 ఎన్నికలలో జగజీవన్ రామ్ కేవలం దళితుడు కావడంతో జనతా పార్టీ ఓటమి చెందింది. సమీప భవిష్యత్‌లో ఓ దళితుడు భారత ప్రధాని కాగలరని ఊహించే పరిస్థితులు ప్రస్తుతం లేవు.రిషి సునాక్ తదుపరి ప్రధానమంత్రి కాకపోతే, దేశానికి 'చెడ్డపేరు' వస్తుందని, 'జాత్యహంకారంగా భావించబడుతుంది' అని ఒక ప్రముఖ కన్జర్వేటివ్ దాత హెచ్చరించారు. అధికార పక్షానికి 1.3 మిలియన్ల పౌండ్ల విరాళం ఇచ్చిన రామి రేంజర్ ఈ వ్యాఖ్యలు చేశారు.సెప్టెంబర్ 5న ఫలితాలు వెలువడినప్పుడు బహుశా లిజ్ ట్రస్ ప్రధానిగా కావచ్చు. ఆమెకు గట్టి పోటీ ఇచ్చిన సునాక్‌కు విదేశీ వ్యవహారాలు లేదా హోం వంటి మరో కీలక మంత్రిత్వ శాఖను ఇచ్చి సంతృప్తి పరచే ప్రయత్నం చేయవచ్చు. ప్రధాన మంత్రి పదవి తర్వాత కీలకమైన నాలుగు మంత్రిత్వ శాఖలలో ఒకటి పొందవచ్చు. ఇప్పటికే ఆర్థిక వ్యవహారాలు పర్యవేక్షించారు. ఏదేమైనా ఓ 'నల్లవాడు' ను తమ దేశపు ప్రధాన మంత్రిగా అంగీకరించడానికి బ్రిటిష్ సమాజం ఇంకా సిద్ధంగా లేదనే స్పష్టమైన సందేశం ఈ ఎన్నికల ద్వారా వెల్లడి చేసే అవకాశం ఉంది. ఏదేమైనా, సునాక్ బ్రిటన్‌లోని భారతీయ సమాజాన్ని దేశంలోని అత్యున్నత పదవికి చాలా దూరం తీసుకువచ్చారు.

# వంగవీటి రాధా కోసం కమలం వ్యూహాలు

విజయవాడ, ఆగస్టు 30, ఉత్తరాదిలో ఒక వెలుగు వెలుగుతున్న భారతీయ జనతా పార్టీ దక్షిణాదిలో కూడా స్థానం సంపాదించుకోడానికి చేయని ప్రయత్నం లేదు. పన్నని వ్యూహం లేదు. ఉత్తరాది నేతల చేతుల్లో ఉండే పార్టీగా పేరు పడిన బీజేపీ దక్షిణాదిలో ఒక్క కర్ణాటక రాష్ట్రంలో మాత్రమే అధికారంలో ఉంది. తెలంగాణలో పాగా వేసేందుకు ఆ పార్టీ అగ్ర నేతలు తరచూ హైదరాబాద్ సహా రాష్ట్రంలోని వివిధ నగరాలు ప్రాంతాల్లో పర్యటనలు చేస్తూనే ఉన్నారు. ఇక విభజిత ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ ఉనికే నామమాత్రం అన్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ పట్టు వదలని విక్రమార్కుడిలా బీజేపీ నేతలు ఏపీని కూడా ఎలాగైనా చిక్కించుకోవాలని అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రేశ్ ను అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్ పార్టీని విభజిత ఏపీ ప్రజలు నిట్ట నిలువునా పాతేశారు. అలాగే ఏపీ విభజనకు తోడ్పడి, ఆ తరువాత రాష్ట్రానికి రావలసిన విభజన హామీలకు ఎగనామం పెట్టిన బీజేపీ అన్నా కూడా ఆంధ్ర ప్రజలలో ఆగ్రహ జ్వాలలు ఎగసిపడుతూనే ఉన్నాయి. అందుకే బీజేపీ ఏ కార్యక్రమం తీసుకున్నా ఏపీలో విజయం సాధించిన దాఖలాలు దాదాపు మృగ్యం. గతంలో కాపు సామాజికవర్గానికి చెందిన కన్నా లక్ష్మీనారాయణకు పార్టీ రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవి కట్టబెట్టినా బీజేపీకి ఏమీ ఒరగలేదు. తర్వాత అదే సామాజికవర్గానికే చెందిన సోము వీర్రాజుకు పగ్గాలు అప్పగించినా బీజేపీ పెద్దల పాచిక పారలేదు. ఎన్ని రకాల పిల్లి మొగ్గలు వేసినా బీజేపీ ఆటలు ఏపీలో అరటిపండు మాదిరిగానే మిగిలిపోయాయి(ఆటలో అరటి పండు). ఈ నేపథ్యంలోనే బీజేపీ మరో కొత్త వ్యూహానికి పదును పెట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో రాష్ట్రంలోని వివిధ సామాజిక వర్గాలు, తరగతుల్లోని నాయుకులకు తన వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా ఏపీలో ఎన్నికల ఏదో ఒక మేరకు ప్రభావితం చేయగల కాపు సామాజికవర్గం ఓట్లను వచ్చే ఎన్నికల నాటికి అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ వివిధ మార్గాల్లో యత్నాలు చేస్తోంది.ఈ క్రమంలోనే కాపు సామాజికవర్గంలో బలీయమైన మద్దతు ఉన్న వంగవీటి రాధాకు తాము అనుకూలమనే సంకేతాలు బీజేపీ నేతలు పంపుతున్నారు. దివంగత కాపు నేత వంగవీటి రంగా కుమారుడిగా రాధాకు ఆ సామాజికవర్గంలో మంచి పలుకుబడి ఉందనేది నిస్సందేహం. ప్రస్తుతం టీడీపీలో కొనసాగుతున్న వంగవీటి రాధా అంతకు ముందు కాంగ్రెస్ పార్టీలో, చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో ఉన్నారు. అక్కడి నుంచి వైసీపీలో చేరారు. ఇప్పుడు టీడీపీలో చేరి, అదే పార్టీలో కొనసాగుతున్నారు.టీడీపీలో వంగవీటి రాధా ఉన్నప్పటికీ ఆయనకు సరైన గుర్తింపు లేదనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో అప్పుడప్పుడు వినవస్తుంటాయి. టీడీపీలో తనకు ప్రాధాన్యం దక్కడం లేదనే అసంతృప్తి తనకు ఉన్నట్లు ఏనాడూ రాధా స్వయంగా బయటికి చెప్పలేదు. అయినప్పటికీ వంగవీటి రాధాను తమ వైపు తిప్పుకుని కాపు సామాజికవర్గం ఓట్లను రాబట్టుకోవాలనే యోచనతో బీజేపీ పావులు కదుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. విజయవాడ రాజకీయ వర్గాల్లో ఇదే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.'వంగవీటి రాధా ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో చెప్పడం కష్టం. టీడీపీలో ఉన్నానని రాధా చెబుతున్నా వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ టికెట్ వస్తుందనే గ్యారంటీ లేదు.

అందుకే రాధా మా పార్టీలోకి వస్తే.. ఆయన భవిష్యత్తు బాగుంటుంది' అని విజయవాడలోని ఓ బీజేపీ నేత వ్యాఖ్యానించడం గమనార్హం. బీజేపీ ఏపీ చీఫ్ సోము వీర్రాజు కూడా రాధా ప్రొఫైల్ గురించి వాకబు చేసినట్లు చెబుతున్నారు. రాధాయే గనుక బీజేపీలోకి వస్తే.. ఆయన కోరుకున్న స్థానంలో పార్టీ టిక్కెట్ ఇప్పించే బాధ్యత సోము వీర్రాజు తీసుకున్నారంటున్నారు. ఈ విషయమే రాధాకు ఏదో ఒక విధంగా చేరవేసి, ఆయనను బీజేపీలో చేర్చుకునే యత్నాలు మొదలయ్యాయని సమాచారం. బీజేపీ యత్నాలు సఫలమై, ఆ పార్టీలో రాధా చేరితే.. ఏపీలో రాజకీయ ముఖచిత్రం ఎలా ఉండబోతోందో చూడాలి మరి.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

కడప మట్టి గణేష్ విగ్రహాలతో వినాయక చవితి నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు పాటు పడుదామని యోగివేమన విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య దుర్భాక విజయరాఘవ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ అధిపతి డా. మూల మల్లికార్జున రెడ్డి, సహ ఆచార్యులు డా. మృత్యుంజయ రావు ఆధ్వర్యంలో తయారు చేసిన మట్టి విగ్రహాల పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వై వి యు కులసచివులు ఆచార్య విజయ రాఘవ ప్రసాద్ హాజర య్యారు. బోధన, బోధనేతర సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ విగ్రహాల తయారీలో రసాయనాలు వినియోగించడం వల్ల భూమి, పర్యావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. కాలుష్య నివారణకు మనమంతా విశ్వవిద్యాలయంలో తయారుచేసుకున్న మట్టి విగ్రహాన్ని వినియోగించి పండుగను నిర్వహించు కుందామని పిలుపునిచ్చారు. ఈ సంప్రదాయం ఇలాగే కొనసాగుతూ రాబోయే తరాలు కూడా రసాయనాలు లేని విగ్రహాలను వినియోగిస్తారన్నారు. ఈ సందర్భంగా లలిత కళల శాఖను అభినందించారు. కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ డాక్టర్ మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ రెండేళ్లుగా మట్టి విగ్రహాల వినియోగించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. సహ ఆచార్యులు కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అధికారుల ప్రోత్సాహం ఉన్నందువల్లే ఈ కార్యక్రమం చేయగలిగాం అన్నారు. ఎన్.ఎస్.ఎస్. సమన్వయకర్త డా.ఎ.మధుసూధనరెడ్డి, డా.వారిజ, డా.విజయకుమార్ నాయుడు, ఆదినారాయణరెడ్డి విగ్రహాలు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో లలిత కళలు, థియేటర్ ఆర్ట్ శాఖ అధ్యాపకులు సి.హెచ్. వెంకటేష్,డా. కొప్పోలు రెడ్డి శేఖర రెడ్డి, బి.చినరాయుడు, సిహెచ్ అప్పలాచారి,డి.వెంకటేష్ యాదవ్,బి.ఈరప్ప , విద్యార్థులు, ఇతరా శాఖల అధ్యాపకుల, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు

### వాతావరణ కాలుష్యం మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ అభినందనీయం

నెల్లూరు వాతావరణ కాలుష్యరీత్య మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయడం అభినందనీయమని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు .నెల్లూరు నగరంలో గాంధీ బొమ్మ వద్దనున్న వెంకట్రామా షాపి పుస్తకాల అంగడి నందు 7000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసిన సందర్భంగా నెల్లూరు పంచాయతీ అధికారి ఎమ్ ధనలక్ష్మి ఆంధ్రప్రదేశ్ పేపర్ మర్చంట్ అసోసియేషన్ మరియు శ్రీశ్రీ ఏజెన్సీ నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయకుడు తొలి పూజలు అందుకునే దేవుడని, వినాయక చవితిని స్వాతంత్ర ఉద్యమంలో బాలగంగాధర్ తిలక్ ఆధ్వర్యంలో సామూహికంగా పండుగలను నిర్వహించుకోవడం జరిగిందని తెలియజేశారు. పర్యావరణం పరిరక్షణ కోసం వినాయక చవితి వేడుకలను మట్టి వినాయక విగ్రహాలతో పూజించి, తదుపరి సామాజిక స్పృహతో మట్టి వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రతి ఒక్కరూ ఇళ్లలోని మట్టి పూల కుండీలలో నిమజ్జనం చేయాలని కోరారు.ఈ సందర్భంగా అధినేత శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 7ళ్లుగా ప్రతి సంవత్సరం ఏడు వేలకు పైగా మట్టి విగ్రహాలను పాఠశాల విద్యార్థుల ద్వారా పంపిణీ చేశామని ,ఈ సంవత్సరం మహిళలకు పంపిణీ చేశామన్నారు. సాంప్రదాయబద్ధంగా 21 రకాల పత్రులతో పూజలు చేస్తూ ,పర్యావరణ పరిరక్షణకు నాంది పలుకుతున్నామన్నారు.

# టీచర్లకు ఇబ్బందిగా మారిన ఫేస్ రికగ్నైజేషన్ యాప్

విజయవాడ, ఆగస్టు 30,సెప్టెంబర్ 1న మిలియన్ మార్చ్ పేరుతో ఏపీలోని సీపీఎస్ ఉద్యోగులు సీఎం జగన్ ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ ఆందోళనల్లో పాల్గొనేందుకు ఉద్యోగ సంఘాల్లోని పలువురు టీచర్లు సిద్ధం అవుతున్నారు. అయితే టీచర్ల హాజరు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఫేస్ రికగ్నైజేషన్ యాప్ వారిని ఇరుకున పెట్టే అవకాశం కనిపిస్తోంది. ఈ యాప్ ద్వారా ఆందోళనల్లో పాల్గొనే టీచర్లను గుర్తు పట్టే ప్రయత్నాల్లో నిఘా వర్గాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. అటు తాము ప్రతిపాదించిన జీపీఎస్ విధానంలో మార్పు చేర్పులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఇప్పటికే మంత్రి బొత్స ప్రకటించారు. ఓపీఎస్ విధానంలోనూ కొంత మేర తగ్గడానికి ఉద్యోగులు అంగీకరించారని.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 95 శాతం హామీలను మేర నెరవేర్చిందని.. నెరవేర్చని 5 శాతం హమీలల్లో సీపీఎస్ రద్దు అంశం ఒకటి అని తెలిపారు.అటు విజయవాడలో సెప్టెంబర్ 1న తలపెట్టిన మిలీనియం మార్చ్‌పై నెల్లూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో నేతలతో రాష్ట్ర అధ్యక్షుడు బాబురెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబురెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీనే నెరవేర్చాలని తాము కోరుతున్నామని.. పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులకు పోలీసుల ద్వారా నోటీసులు ఇప్పించడం సరికాదన్నారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు కల్పించినా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించి తీరుతామన్నారు. సీపీఎస్ వల్ల ఉద్యోగులకు చాలా నష్టం కలుగుతుందన్నారు. రాజస్థాన్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను అమలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపులకు పోకుండా ఇప్పటికైనా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

# గుంటూరులో పరాకాష్టకు చేరిన పోరు

## మౌనంగా అధిష్టానం

గుంటూరు, ఆగస్టు30, సొంతపార్టీలో వర్గపోరును కంట్రోల్ చేయాలంటే ఏ పార్టీకైనా కష్టమైనా పనే. ఓ వర్గానికి మద్దతు ఇస్తే.. మరో వర్గం అలకబూనితే పార్టీకి నష్టం కలుగుతుందనే ఉద్దేశంతో ఒక్కోసారి హైకమాండ్ కూడా మౌనం వహిస్తుంది. అదే పోరు తీవ్ర స్థాయికి చేరితే హైకమాండ్ ఎంటర్ అవ్వాల్సి వస్తోంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలోని అధికారపార్టీలో ఇద్దరు నేతల మధ్య నెలకొన్న వర్గపోరు హైకమాండ్ కు తలనొప్పిగా మరిందంటున్నారు ఆజిల్లా నేతలు.. ఇంతకీ ఆ ఇద్దరు నేతల్లో హైకమాండ్ మద్దతు ఎవరికుంది.. ఈవర్గపోరు నేపథ్యంలో అధిష్టానం వ్యూహామేంటి..గుంటూరు జిల్లా తాడికొండ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సొంత నేతల మధ్య తగాదా రోజురోజుకీ హీటెక్కిపోతోంది. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ వర్గాలు సై అంటే సై అంటున్నాయి. తాడికొండ నీదా నాదా? అనే రేంజ్‌లో ఇరు వర్గాలు రోడ్డెక్కాయి. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ వర్గీయులు పోటాపోటీ నిరసనలతో స్థానికంగా టెన్షన్ వాతావరణం నెలకొంది. తాడికొండ నియోజకవర్గంలో డొక్కా మాణిక్యవరప్రసాద్ ను అడినషనల్ కోఆర్డినేటర్‌గా నియమించడంపై ఉండవల్లి శ్రీదేవి వర్గం భగ్గుమంటోంది. మాణిక్యవరప్రసాద్ కు వ్యతిరేకంగా ఉండవల్లి శ్రీదేవి గ్రూప్ తాడికొండలో భారీ ర్యాలీ నిర్వహించింది. శ్రీదేవి వర్గీయులు ర్యాలీ ప్రారంభించే సమయంలో ఒక్కసారిగా డొక్కా మాణిక్య వరప్రసాద్ వర్గం ఎంట్రీ ఇచ్చింది. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ కు మద్దతుగా.. ఉండవల్లి శ్రీదేవికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోటాపోటీ నినాదాలతో తాడికొండలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది.డొక్కా మాణిక్యవరప్రసాద్ కారణంగా తాడికొండలో వైసీపీ నష్టపోయే ప్రమాదం ఏర్పడుతోందంటున్నారు శ్రీదేవి అనుచరులు. తమకు సజ్జల రామకృష్ణారెడ్డి సపోర్ట్ ఉందని చెప్పుకుంటున్నారు. మరోవైపు ఉండవల్లి శ్రీదేవి వల్ల తాడికొండలో అరాచకం జరుగుతోందంటున్నారు డొక్కా మాణిక్యవరప్రసాద్ అనుచరులు. మూడున్నరేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని, డొక్కా నాయకత్వంలో డెవలప్‌మెంట్ జరుగుతోందంటున్నారు. రెండు వర్గాలుగా విడిపోయిన అధికార పార్టీ కార్యకర్తలు, చివరికి కొట్టుకునేవరకు వెళ్తున్నారు. ఇరువర్గాలు కూడా తగ్గేదేలే అంటున్నారు. శ్రీదేవి వర్గం రోడ్లపైకి వస్తే, డొక్కా వర్గం కూడా రోడ్లపైకి వస్తోంది. వాళ్లు ప్రెస్‌మీట్ పెడితే, వీళ్లూ పెడుతున్నారు. ఇలా తాడికొండ నియోజకవర్గం మొత్తం డొక్కా మాణిక్యవరప్రసాద్, శ్రీదేవి వర్గాల ఆందోళనలతో అట్టుడికిపోతోంది. ఈవర్గపోరు అధిష్టానానికి పెద్ద సమస్యగా మారిందంటున్నారు జిల్లా నేతలు.

# మార్కెట్లో కొత్త రకం మామిడండి...

ఒంగోలు, ఆగస్టు 30, పునారస్ మామిడికి ప్రస్తుతం గిరాకీ వచ్చింది. మామిడి వేసవి సీజన్ పూర్తయిన తరువాత వచ్చే మామిడికాయల రకం ఈ పునారస్.. గతంలో కొద్దిగా వచ్చే ఈ కాయలకు గిరాకీ ఉండడంతో ఈ ప్రాంతంలో గత ఐదేళ్లుగా ఈ చెట్లను అధికంగా నాటారు. దీని కారణంగా ప్రస్తుతం ఈ సీజన్‌లో పునారస్ మామిడి కాయలు అధికంగా వచ్చాయి. ఉలవపాడు మార్కెట్ నుంచి ఈ కాయలు ప్రస్తుతం భారీగా ఎగుమతులు జరుగుతున్నాయి. ఉలవపాడు కేంద్రంగా వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు ఇక్కడకు వస్తారు.ఇక్కడ ఉన్న దళారులు రైతుల నుంచి కాయలను కొనుగోలు చేసి మార్కెట్‌లో తూకం వేసి బస్తాలు, ట్రేలలో లారీలు, మినీ ట్రక్కులు, ఆటోల ద్వారా వివిధ ప్రాంతాలకు ఎగుమతులు చేస్తారు. ఈ ఏడాది మార్కెట్‌లో దాదాపు 10 కేంద్రాల నుంచి కాయల ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రధానంగా తమిళనాడు, కేరళకు ఈ మామిడికాయలు తరలివెళ్తాయి. పచ్చళ్లకు అధికంగా ఈ కాయలను వినియోగిస్తారు. ఈ ఏడాది రేటు కూడా కాస్త అధికంగానే ఉంది. ఈ వేసవిలో మామిడి కాయలకు పండు ఈగ సోకి కాయల్లో పురుగులు రావడంతో రైతులు నష్టపోయారు. ఈ సమయంలో పునారస్ చెట్లు ఉన్న రైతులు ఈ ఏడాది రేటు అధికంగా ఉండడంతో ఊరట ఇచ్చినట్టయింది. నాలుగేళ్ల క్రితం నుంచి పోలిస్తే ఈ ఏడాది పునారస్ మామిడి కాయల ఎగుమతులు భారీగా పెరిగాయి. రైతులు సీజన్ కాని సమయంలో వస్తున్న కాయలు కావడంతో ఇటీవల కాలంలో ఎక్కువగా సాగు చేశారు. ఉలవపాడు ప్రాంతంలో దాదాపు 4000 ఎకరాలకు పైగా ఈ తోటలు ఉన్నాయి. ఇక పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 8 వేక ఎకరాల్లో పునారస్ తోటలు ఉన్నట్లు సమాచారం. కానీ ప్రతి ఏడాదికి వీటి సాగు శాతం పెరుగుతుంది. ఈ ఏడాది గత నెల నుంచి రోజుకు సుమారు 50 నుంచి 80 టన్నుల కాయలు ఎగుమతులు చేస్తున్నారు. ఈ ఏడాది కేజీ 40 నుంచి రూ.50 వరకు పునారస్ మామిడి రేటు పలుకుతుంది. గతంలో 25 నుంచి చిన్నగా పెరుగుతూ చివరి దశలో రూ.50కు చేరుకునేది. ఈ సారిమాత్రం రూ.40 నుంచి రూ.50 మధ్యనే ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రధానంగా ఈ మామిడికాయలు చెన్నై, తిరువనంతపురం, కోయంబేడు, కోయంబత్తూరుకు తరలివెళుతున్నాయి. రోజుకు సుమారు 30 నుంచి 50 లక్షల మధ్య ఉలవపాడు మార్కెట్‌లో వ్యాపారం జరుగుతుంది. కేరళలో ఈ నెల 31 నుంచి ప్రారంభమయ్యే వచ్చే నెల 8 వరకు జరిగే ఓనమ్ పండుగకు ఉలవపాడు పునారస్ కాయలు ప్రత్యేకంగా ఉపయోగిస్తారు. అక్కడ పెట్టే పచ్చడికి దీనిని ఉపయోగిస్తారు. ఈ సమయంలో అంటే సెప్టెంబరులో ఇంకా భారీగా రేట్లు పెరుగుతాయి. ఇక్కడ నుంచి ఓనమ్ పండుగకు ప్రత్యేకంగా గ్రేడ్ చేసిన కాయలను తరలిస్తారు.

# మరో యాత్రకు కమలం సమాయాత్తం

తిరుపతి, ఆగస్టు 30, యాత్రలు పలు రకాలు. భక్తులు దూరప్రాంతాల్లోని పెద్దపెద్ద దేవాలయ దర్శనానికి చేసే యాత్రలు, హిమాలయాలకు వెళ్లే జనం యాత్ర, అయ్యప్ప దీక్షలుపట్టి వెళ్లవారి యాత్ర. ఇప్పుడు రాజకీయపరమైన కాషాయరంగుతో కొత్తగా వినపడుతున్నది బీజేపీ యాత్ర. ఈ యాత్ర రాజకీయపరమై దండయాత్రకు కాస్తంత తక్కువ స్థాయిది. దీనికి కార్యకర్తలు, పెద్ద పెద్ద పార్టీ పతాకాలతో వీలయినన్ని రకరకాల బళ్ల మీద నాయకుని వెంట వేలంవెర్రిగా చేసే యాత్ర. దీనికి లక్ష్యం కేవలం రాజకీయ లబ్ధి. కేవలం ఆయా ప్రాంత పాలకుల మీద గొంతు చించుకోవడానికి, నినాదాలతో హోరెత్తిండం దాని లక్ష్యం.రాజకీయంగా తమ స్థిరత్వాన్ని నిరూపించుకోవడానికి, తమ సత్తాను ప్రజలకు, పాలకవర్గీయులకు గట్టిగా తెలియజేయడానికి, తమను మించినవారు వేరెవ్వరూ లభించరన్న ప్రచారం చేసుకోవడంలో ఉవ్వె త్తున భారీ ప్రచారహోరుతో చిన్నా చితకా నాయకులు ఊరేగే యాత్ర. దీనికి కేవలం తమ పార్టీ నీడలో బాగా ప్రశాంతంగా ఉండవచ్చున్న నమ్మకం కలిగించడానికి వీలయినన్ని తిట్ల దండకంతో విపక్షాలమీద విరుచుకుపడే అవకాశం ఉంటుంది.రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలను నిర్వీర్యం చేసి అధికారంలోకి రావడానికి బీజేపీ శాయశక్తులా కృషి చేస్తోంది. ఎలాగయినా రెండు రాష్ట్రాల సీఎంలు ప్రజాభిమానాన్ని పొందని నాయకులుగా ప్రచారం చేసి తమ పార్టీయే ప్రజాసంక్షేమాన్ని నిజంగా కోరుకుంటోందన్నది ప్రచార హోరుతో ప్రజల్ని ఆకట్టు కుంటూ అధికారంలోకి వచ్చేయాలన్న ఆకాంక్షతో బీజేపీ రెచ్చి పోయి రాజకీయ యాత్రలు చేపడుతోంది. ఏదో ఒకసమస్యను సృష్టించడమో, ఉన్నదాన్ని కాస్తంత విమర్శల కారం పూసి పాలకపక్షాన్ని మరింత విసిగెత్తించి అసహనాన్ని అనుకూలం చేసుకోవడంలో బీజేపీ నాయకుల మేధోశక్తి మరెవరికీ ఉండదు. అది వారికి వెన్నతో పెట్టినవిద్య. నిన్న మొన్నటివరకూ తెలంగాణాలో భారీ ప్రదర్శనలు, సమావేశాలతో ఊదరగొట్టారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని, పాలనా విధానాన్ని, పథకాల అమలు అన్నింటా ప్రజల్ని మోసం చేశారని ఘాటుగా విమర్శిస్తూ ప్రజల అభిమానాన్ని పొందేందుకు బీజేపీ సీనియర్ నాయకులు కూడా ఢిల్లీ నుంచి తెలంగాణా యాత్రలు చేశారు. అక్కడ మునుగోడు ఉప ఎన్నిక లక్ష్యంతో ప్రజల్ని ఓటర్లను తమ వేపు తిప్పుకోవడానికి వేయాల్సిన వలలన్నీ పన్ని వేశారు, వేస్తున్నారు. ఇపుడు కాస్తంత సమయం తీసుకుని ఆంధ్రప్రదేశ్ రాయలసీమ వేపు మరో యాత్రకు బీజేపీ సిద్ధ పడింది. రాయలసీమ ప్రాంతంలోని పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మరోయాత్ర కు రాష్ట్ర బిజేపీ నిర్ణయం తీసుకుంది. ఏపీ బీజేపీ అధ్యక్షులు సోము వీర్రాజు యాత్రకు నాయకత్వం వహించనున్నారు. బీజేపీ బలోపేతం కోసం రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టనున్నారు. 25 చోట్ల బహి రంగ సభలు, సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానా లకు వ్యతిరేకంగానూ, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు నాయకులు వివరిం చను న్నారు. కేవలం తమకు దేశంలో ప్రతిపక్షం ఉండకూడదన్న యావతోనే ఇటువంటి యాత్రలతో విపక్షాలను భయాందోళనకు గురిచేయడానికి, ప్రజలను మరింత సందిగ్ధంలో పడేయడానికి పూనుకున్నారేగాని వాస్త వానికి కేంద్రంలో తమ పాలన విషయంలో తలెత్తుతున్న వ్యతిరేకతలను పట్టించుకోవడం మేలు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో ఆధార్

విజయవాడ, ఆగస్టు30, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పుట్టిన శిశువులకు వెంటనే ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ నంబర్ రానుంది. ఈ ప్రక్రియను త్వరలో ప్రారంభించడానికి వైద్య శాఖ చర్యలు తీసుకుంటోంది. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేపట్టడానికి ఏరియా, జిల్లా, బోధన ఆస్పత్రులకు ట్యాబ్‌లు, ఫింగర్ ప్రింట్ స్కానర్‌లను సమకూర్చారు. ఆస్పత్రుల్లో పుట్టిన పిల్లలకు బర్త్ రిజిస్ట్రేషన్ తరహాలోనే శిశు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేపట్టనున్నారు.ఇందులో భాగంగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు యూఐడీఏఐ ఓ పరీక్ష నిర్వహించి అందులో అర్హత సాధించిన వారికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనుంది.

# గందరగోళంలో పోలవరం



ఏలూరు, ఆగస్టు 30, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గందర గోళంలో పడింది. ప్రాజెక్టును ఎప్పటికి పూర్తిచేస్తామో చెప్పలేమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పదే పదే చెబుతున్నారు. ప్రతిపక్షనాయకుడి హోదాలో జగన్ ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం సీఎంగా ఆయన మాటలకు పొంతన లేకుండా పోయింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై అప్పట్లో జగన్ చెప్పిన మాటలకు ఇప్పుడు చేస్తున్నదానికి ఏమాత్రం పొంతన లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ఘాటు విమర్శలు చేశారు. ప్రాజెక్టు నిర్మాణం ఇంత ఆలస్యమా అని నిందించారు. అంచనాలు పెంచేశారని ఆగ్రహించారు. నిర్వాసితుల ముఖాల్లో ఆనందం చూసేందుకు వారి డిమాండ్లు నెరవేర్చలేరా అని టీడీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్రంతో పోరాడలేరా? అని నిలదీశారు.అలాంటి జగన్ తన మాట ఇప్పుడు మార్చేశారు. కాడి కింద పడేశారు. మడమ తిప్పేశారు, మాట తప్పేశారు. ఇదంతా నేను ఒక్కణ్ణి చేసేది కాదు కదా కేంద్రాన్ని అడుగుతా.. ఒత్తిడి చేస్తా.. వాళ్లు నిధులిస్తే మీకు అందిస్తా.. లేకపోతే నేనేం చేయగలను అని బేలగా ప్రకటించి చేతులెత్తేశారు. అధికారంలోకి రాగానే పోలవరం అవినీతిని తేల్చేస్తానంటూ ఓ కమిటీని జగన్ నియమించారు. ఆ కమిటీ రేపో మాపో అవినీతి వరద లోతుల్ని తేల్చేస్తుందని అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. కమిటీ నివేదిక ఇచ్చినా ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.జగన్ అధికారంలోకి రాగానే పోలవరం పనులను ఆపేశారు. 2019 నవంబరులో రివర్స్ టెండరింగ్ పేరుతో గుత్తేదారును మార్చి, మేఘా ఇంజినీరింగ్ కంపెనీకి పనులు అప్పగించారు. ఆ తర్వాతైనా పోలవరం పనులు వేగం పుంజుకున్నాయా? అంటే అదీ లేదు. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయలేదు. దీంతో 2019, 2020లలో డయాఫ్రం వాల్ దెబ్బతింది. ప్రధాన డ్యాం నిర్మించాల్సిన చోట భారీగా ఇసుక కోత ఏర్పడి ప్రాజెక్టు భవితవ్యానికి పెను సవాల్ విసిరింది.పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసంపైనా జగన్ ఆడిన మాట తప్పారు. పోలవరం ప్రాజెక్టుకు భూములిచ్చిన వారికి రూ.5 లక్షలు ఇస్తామని నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రకటించారు. ఇప్పటికీ ఆ ప్రకటనకు అతీగతీ లేదు. పునరావాస ప్యాకేజీ రూ. 10 లక్షలకు పెంచుతామని ప్రతిపక్ష నేతగా జగన్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం గరిష్ఠంగా ఎస్టీలకు రూ.6.86 లక్షలు ఇస్తున్నారు. గిరిజనేతరులకు రూ.6.36 లక్షలే ఇస్తున్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంపై రకరకాల గడువులు చెప్పారు. 2021 డిసెంబర్ నాటికి పూర్తిచేస్తామని తొలుత ప్రకటించారు. ఆనక 2022 ఖరీఫ్ నాటికి పోలవరం పూర్తిచేసి నీళ్లిస్తామని చెప్పారు. ఇప్పుడు ఆ మాటలన్నీ నీటిమూటలయ్యాయి.పోలవరం ప్రాజెక్టుపై జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు చేతులెత్తేశారు. ప్రాజెక్టు పూర్తిచేస్తామని రెండేళ్లుగా నమ్మించిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు చేతులెత్తేసే పరిస్థితి వచ్చిందంటే సమస్యలు ఎవరి హయాంలో తలెత్తాయనే ప్రశ్నలు వస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయాలంటే నిధులే కీలకం. ఇప్పటికీ రెండో డీపీఆర్ కు ఆమోదం లేదు. 2019 ఫిబ్రవరిలో 55 వేల 549 కోట్ల రూపాయలకు సాంకేతిక సలహా కమిటీ పోలవరం అంచనాలు ఆమోదించింది. ఆ తర్వాత కేంద్రం దీన్ని రివైజ్డ్ కాస్ట్ కమిటీకి అప్పజెప్పింది. ఆ కమిటీ 47 వేల 726 కోట్ల రూపాయలకు అంచనాలు ఆమోదించింది. పోలవరం తాజా అంచనాలకు ఇంతవరకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలపలేదు. కేంద్రం కొర్రీలపై కొర్రీలు వేస్తున్నా ఏపీ సర్కార్ పరిష్కరించుకోలేకపోతోంది. నాడు డీపీఆర్ ఆమోదించు కోలేకపోయారని విమర్శించిన జగన్ ఇప్పుడు.. 'పోలవరం నిధులు కేంద్రం ఇవ్వడం లేదు.. మనం కిందా మీద పడుతున్నాం. వెయ్యి కోట్లో, 2 వేల కోట్లో అయితే నేనే ఇచ్చేసేవాణ్ణి. వేల కోట్ల రూపాయలు కేంద్రం ఇవ్వాలి. నేనేం చేయగలను' అని ఎదురు ప్రశ్నిస్తుండడం గమనార్హం.ఏపీలో అన్ని ఎంపీ స్థానాల్లోనూ వైసీపీని గెలిపిస్తే.. ప్రత్యేక హోదా సాధిస్తా, కేంద్రం నుంచి అన్నీ తెస్తా అని ఎన్నికల్లో ఓట్లు అడిగిన జగన్ రాష్ట్రపతి ఎన్నిల్లోనూ, పలు కీలక బిల్లుల విషయంలో కేంద్రానికి బేషరతుగా ఎందుకు మద్దతు ఇస్తున్నారు? రాజ్యసభలో, లోక్ సభలో ఎందుకు మద్దతిస్తున్నారు? పోలవరం డీపీఆర్-2 ఆమోదం పొందేలా కేంద్రంపై ఒత్తిడి ఎందుకు చేయడం లేదు.. అనే విమర్శలు వెల్లువెత్తుతున్నా జగన్ స్పందించడం లేదు.పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు మూడేళ్లుగా అవస్థలు పడుతున్నాయి. ఎగువ కాఫర్ డ్యాం నిర్మాణం పూర్తయిన తర్వాత గోదావరి వరదనీరు వెనక్కి ఎగదన్ని ముంపు గ్రామాల ప్రజలు విలవిల్లాడుతున్నారు. నిర్వాసితుల వరద కష్టాలు కళ్లారా చూసినా వరదల సమయానికి కూడా వైసీపీ ప్రభుత్వం కనీసం తొలిదశ పునరావాసం ఎందుకు పూర్తి చేయలేకపోయిందనే ప్రశ్నలు ప్రతిపక్ష టీడీపీ సంధిస్తోంది. తొలిదశలో 20 వేల 946 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 8 వేల 272 కుటుంబాలకే కల్పించింది. పునరావాస కాలనీలు ఇంకా పూర్తికాలేదు. పునరావాస ప్యాకేజీ అందలేదు. వరద ముంపును తట్టుకోలేక నిర్వాసితులు గోకవరం, జంగారెడ్డిగూడెం, చర్ల వంటి చోట్లకు వలస వెళ్లి అద్దె ఇళ్లలో కాలం వెళ్లదీస్తున్నారు. నెలకు 6 వేల నుంచి 8 వేల రూపాయల వరకు అద్దెలు భరిస్తున్నారు. జగన్ చెప్పినట్లు 'మా ముఖాల్లో ఆనందం చూడటం అంటే ఇదేనా?' అని నిర్వాసితులు నిలదీస్తున్నారు. ఏటా వరదల ముందు అందరినీ తరలించేస్తామని మూడేళ్లుగా ప్రణాళికలు రచిస్తున్నా ఇప్పటికీ అది కార్యరూపం దాల్చపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

## కేంద్ర నిధులు ఎమ్మాయ్యాయి

విశాఖపట్నం వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధులను ప్రభుత్వం ఎం చేసిందని బీజేపీ ఎంపి జివిఎల్ నరసింహారావు ప్రశ్నించారు.వైసీపీ ప్రభుత్వం సొంత ప్రయోజనాల కోసం వినియోగించుకుందని,వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఏపీలో 175 నియోజకవర్గాల్లో 500 సభలు ఏర్పాటు చేసుకుని వైసీపీ ప్రభుత్వం పై పోరాటం చేస్తామని చెప్పారు.ఉత్తరాంధ్ర లోపెండింగ్ నీటి ప్రాజెక్టు పూర్తి చేయడం లో వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహిస్తుందని,ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై బీజేపీ చేపట్టబోయే పోరుబాటకు సంబందించి రూట్ మ్యాప్ ను సిద్దం చేస్తున్నట్లు తెలిపారు.రెండు రాష్ట్రాల ప్రభుత్వాల సమస్యలకు కేంద్రం సహకరిస్తుందని,రెండు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉంటే ఎలాంటి సమస్య అయిన పరిష్కారం అవుతుందని చెప్పారు.రైతు ప్రభుత్వం అని చెప్పుకునే జగన్ ... ఈ మూడేళ్లల్లో రైతు ఆత్మహత్యల్లో ఏపీ మొదటి స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.వైజాగ్ 2030 అనే విజన్ ద్వారా బీజేపీ విశాఖ అభివృద్ధి ఎలా చేస్తామో ప్రజలకు వివరిస్తామని తెలిపారు.175 నియోజకవర్గాల్లో బీజేపీ నాయకులు పోటీ చేస్తారని,బీజేపీ ప్రభుత్వాలు లేని రాష్ట్రాల్లో రాజద్రోహం కేసులు పెట్టిన రాష్ట్రాల్లో ఏపీ మొదటి స్థానం ఉందని,ప్రత్యర్థుల పై ఒక ఆయిదంగా రాష్ట్ర ప్రభుత్వం రాజద్రోహం కేసులను నమోదు చేస్తోందని తెలిపారు.

## హార్బర్ లో అక్రమ వసూళ్లు లేవు

విశాఖపట్నంవిశాఖ ఫిషింగ్ హార్బర్ లో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జానకిరామ్ తెలిపారు.కొంత మంది రాజకీయ నాయకులు కుట్రపూ రితంగా రకరకాల ఆరోపణలు చేస్తున్నారని,విశాఖ ఫిషింగ్ హార్బర్ ప్రతిష్టను దెబ్బ తీయాలని చూస్తున్నరని,తాను ఒక్కరూపాయి అక్రమంగా వసూలు చేశానని నిరూపిస్తే ఫిషింగ్ హార్బర్ ను విడిచిపెట్టేందుకు సిద్దంగా ఉన్నామని చెప్పారు.మత్స్యకారుల సమస్యల కోసం పోరాడుతున్నామని,గత పాలకుల హయాంలో ఫిషింగ్ హార్బర్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని,మంత్రి సిరి అప్పలరాజు పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.

## తెలంగాణలో బీజేపీ సర్కార్ వస్తుంది

తిరుమల, ఆగస్టు 30, బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీసమేతంగా ఈరోజు తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన తెలంగాణ రాజకీయాలపై హాట్ కామెంట్స్ చేశారు. తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి వచ్చితీరుతుందన్నారు. మునుగోడు ఉపఎన్నికతో కేసీఆర్ అరాచక పాలనను ప్రజలు అంతం చేయాలన్నారు. ప్రజలంతా కేసీఆర్ ను గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. మునుగోడు ఉప ఎన్నికల 4 కోట్ల తెలంగాణ ప్రజల కోసం వచ్చే ఎన్నిక అన్నారు. రాష్ట్రంలో 12 మంది ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొనుగోలు చేశారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ కుటుంబ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించాలని తాను మునుగోడు ప్రజలను కోరుతున్నాని పేర్కొన్నారు. తాను నిజాయితీగా బడుగు బలహీన వర్గాలు, తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవం కోసం నిరంతరం పోరాటం చేస్తానని చెప్పారు. మునుగోడు ప్రజలే నా దేవుళ్లు, వాళ్ల తీర్పును శిరసా వహిస్తానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు సైతం చేశారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డి తీరును తీవ్రస్థాయిలో విమర్శిస్తూ ఆపార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆగష్టు 21వ తేదీన మునుగోడు నియోజకవర్గంలో జరిగిన భారీ బహిరంగ సభ వేదికగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరారు. ప్రస్తుతానికి కేంద్ర ఎన్నికల సంఘం మునుగోడు ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయలేదు. అయినప్పటికి ప్రధాన పార్టీలన్ని మునుగోడుపై ఫోకస్ పెంచాయి. ఉప ఎన్నిక వస్తే బీజేపీ అభ్యర్థిగా కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉండే అవకాశం ఉంది. ఇక అధికార టిఆర్ ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అభ్యర్థిగా ఉండవచ్చనే ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ కూడా ఈరోజు, రేపట్లో అభ్యర్థిని ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నియోజకవర్గం వ్యాప్తంగా పర్యటిస్తూ ప్రజలను కలుసుకుంటూ.. వారి ఆశీస్సులు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే క్రమంలో బీజేపీలో చేరిన తర్వాత తొలిసారి తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు రాజగోపాల్ రెడ్డి.

# ఖనిజ సంపద కొల్లగొట్టడానికి ఏజెన్సీలో మంచి రోడ్లు



### ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్...

డుంబ్రిగూడఏజెన్సీలో నిక్షిప్తమై ఉన్న ఖనిజ సంపదను కొల్లగొట్టడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంచి రోడ్లు నిర్మాణాలు చేపడుతున్నాయని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం డుంబ్రిగూడ లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అరకు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పాచిపెంట శాంతకుమారి ఆధ్వర్యంలో అరకు అసెంబ్లీ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సాకే శైలజనాథ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి రాష్ట్రంలోని వైసిపి ఈ రెండు ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక ద్వంద వైఖరి విధానాలను అవలంబిస్తున్నాయని ఆయన చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాలను అభివృద్ధి పరచడం మాని భవిష్యత్తులో మన్య ప్రాంతాలను మటుమాయం చేయడానికి చీకటి ఒప్పందాలు చేస్తున్నాయని ఆరోపించారు. రాత్రికి రాత్రే పేపర్లపై సంతకాలు పెడుతున్నారని వాటిని మనం చూసేలోపే సీన్లు మారిపోతున్నాయని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న అటవీ ప్రాంతాలను గొల్ల కొట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఏజెన్సీలో ఉన్న గిరిజనులకు బ్రతకడానికి రెండు ఎకరాలు భూమి లేకున్న బడా బాబులు విశ్రాంతి తీసుకోవడానికి 200 ఎకరాల భూములను వారికి కట్టబెడుతున్నారని ఆయన తెలిపారు. మన్య ప్రాంతానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలని గిరిజన చట్టాలను హక్కులను కాపాడడానికి ఏజెన్సీలో పాచిపెంట శాంత కుమారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. రాబోవు కాలంలో దేశంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టనుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జి దయానిధి, ఉపాధ్యక్షులు సులోచన, అరకు అధ్యక్షులు మోహన్ రావు, మహిళా అధ్యక్షులు పద్మ, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు సాయిబాబా ఆరు మండలాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు గిరిజనులు కార్యకర్తలు గిరిజనులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బలమైన నేతల కోసం యత్నాలు

కాకినాడ, ఆగస్టు 30, (న్యూస్ పల్స్)తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల సందడి మొదలైంది. అధికార , ప్రతి పక్ష నేతలు ఒకరిపై ఒకరు మాటల యుద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు నియోజక వర్గాల్లో అన్ని పార్టీలు బలమైన నేతలకు ప్రాధాన్యత నిస్తూ . ఎన్నికలను ఎదుర్కొనేందుకు భారీ వ్యూహరచనలు చేయడం ప్రారంభించారు. అయితే జనబలం ఉన్న జనసేన పార్టీ పరిస్థితి మాత్రం ఆ పార్టీ శ్రేణులను ఆందోళనకు గురి చేస్తోంది. ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాలో బలం ఉందని చెప్పుకుంటున్న జనసేనకు.. కొన్ని నియోజకవర్గాల్లో కనీసం నాయకులు లేరు.. ముఖ్యంగా కార్యకర్తలు, అభిమానులు అధికంగా ఉన్న ఆ నియోజక వర్గంలో పార్టీని నడిపించే నాయకుడు కరువు.. జనసేన పార్టీ కి నాయకత్వం లేని నియోజకవర్గంగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.కోనసీమ జిల్లాలో పి.గన్నవరం నియోజకవర్గంలో అసలు జనసేన పార్టీ ఉందా!.. ఉంటే ఆ పార్టీని నడిపించే నాయకుడు ఎవరు ఇదే ప్రశ్న నియోజకవర్గ జనసేన పార్టీ క్యాడర్లో నెలకొంది. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి ఓటమి అనంతరం కంటికి కనిపించకుండా పోయారు. అంతేకాదు అసలు ఆమె పార్టీలో ఉన్నారో లేరో కూడా ఎవరికి తెలియదుపి.గన్నవరం ఎస్సీ నియోజకవర్గం కావడంతో ఇక్కడ నాయకులు ఎవరు జనసేన వైపు అసలు కన్నెత్తి చూడడం లేదు అంటే అతిశయోక్తి లేదు. గత మూడేళ్లుగా నాయకత్వం లేని నియోజకవర్గంగా పి.గన్నవరం జనసేన చరిత్ర కెక్కింది. నియోజకవర్గంలో ఎంతో కొంత క్యాడర్ ఉన్నప్పటికీ అందరిని సమన్వయం చేసి ముందుకి నడిపించే నాయకుడు లేడని పార్టీ కార్యకర్తలే బాహాటంగా చెబుతున్నారు. మరి రానున్న రోజుల్లో అయినా అధినాయకత్వం ఈ నియోజకవర్గంపై దృష్టి పెట్టి మంచి నాయకులను నియమిస్తారా లేదా ఎలక్షన్ల వరకు ఇలాగే వదిలేస్తారా అన్నది చూడాలి.అన్ని పార్టీలు వైసీపీని ఎదుర్కొనేందుకు ఇప్పటికే బలమైన వ్యూహరచనలు చేసుకుంటుంది. అయితే ఇక్కడ మాత్రం జనసేన పార్టీలో కనీసం సమర్థవంతమైన నాయకత్వాన్ని తీసుకొచ్చే ఆలోచన కూడా చేయకపోవడం పై కార్యకర్తల్లో నిరుత్సాహం పెరుగుతుంది. జనసేన సిద్ధాంతాలకు యువత ఆకర్షతులవుతున్నప్పటికీ వారిని ఉపయోగించుకొని పార్టీని బలోపేతం చేసే నాయకుడు లేకపోవడం సందిగ్ధంలో పడ్డారు కార్యకర్తలు. మరి ఇప్పటికైనా అధిష్టానం స్పందించి.. పార్టీని నడిపించే నాయకుడిని నియమించాలని స్థానిక పార్టీ శ్రేణులు కోరుకుంటున్నారు.

# భర్త వెనుకే భార్య ...

శ్రీకాకుళం, ఆగస్టు 30, మూడు ముళ్లు, ఏడు అడుగులు.. అగ్ని సాక్షిగా ఒక్కటయ్యే దంపతులు.. ఒకరికొకరు తోడునీడగా నిండు నూరేళ్లు జీవిస్తామని ప్రమాణం చేస్తారు. పెళ్లి అయినది మొదలు కష్టసుఖాల్లో తోడునీడగా జీవిస్తారు.. అయితే భర్త భర్తల్లో ఎవరు ముందు పోయినా ఇంకొకరు.. ఆ బాధను తట్టుకోలేరు. కొంతమంది తమ పిల్లలను..బాధ్యతలను గుర్తు చేసుకుని.. తమ భాగస్వామిని గుర్తు చేసుకుంటూ కాలాన్ని వెల్లదీస్తారు. అయితే మరి కొందరు జీవిత భాగస్వామి మరణాన్ని తట్టుకోలేక అవతలివారిని అనుసరిస్తూ.. కానరాని లోకాలను వెళ్ళిపోతారు. తాజాగా ఇటువంటి విషాద ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటు చేసుకుంది.ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సోంపేటలోని విషాద ఘటన జరిగింది. తోటూరు గ్రామానికి చెందిన భర్త సుందరరావు(55) భార్య పుణ్యవతి(48) లకు ఇద్దరు కుమారు. అయితే భార్యాభర్తలు కలిసి ఉపాధి రీత్యా బిలాయ్‌లో నివసిస్తున్నారు. కుర్సీపార్ ఇందిరాగాంధీ విద్యాలయంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. అయితే సుందరరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం అనారోగ్యంతో మరణించారు. భర్త మరణాన్ని భార్య జీర్ణించుకోలేకపోయింది. దిగులుతో భర్త మరణించిన 24 గంటలు కాకముందే.. సోమవారం మధ్యాహ్నం మృతి చెందింది.

# కాణిపాకం... అంతా సిద్ధం

తిరుపతి ఆగస్టు 30, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాకం. ఇక్కడ వెలసిన స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాణిపాకం ఆలయ ఈవో సురేష్ బాబు చెప్పారు. రేపటి నుంచి వినాయక చవితికి వార్షిక బ్రహ్మోత్సవాలను ఆలయంలో 21 రోజులు పాటు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలుజరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. 500 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేశారు. వినాయక చవితి రోజున ఉదయం 10 గంటల నుంచి భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావిస్తున్న ఆలయ సిబ్బంది.. ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## విశాఖలో వినాయక చవితి సందడి

విశాఖపట్నం విశాఖ జిల్లాలో వినాయక చవితి పం దుగు వాతావరణం మొదలైంది.బొ జ్జగణపయ్య పూజలకు మరికొద్ది గంటలే ఉండటంతో విగ్రహాలు కొన డానికి జనాలు పరుగులు పెడుతు న్నారు.జిల్లాలో వినాయకచవితిని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తా రు. నగరంలో వేల విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి నిమజ్జనం చేస్తా రు.గతేడాది కరోనా కారణంగా పండగ కళ తప్పింది.అయితే ఇప్పుడు కరోన తీవ్రత తగ్గడం,రెండేళ్లుగా ఫెస్టివల్ జోష్ లేకపోవడంతో ఈ సారి రెట్టింపు ఉత్సాహంతో ప్రజల్లో కొత్త ఒరవడి నెలకొంది. ఒక్కసారిగా విగ్ర హాల కొనుగోళ్ల కోసం బారులు తీరారు. పోటీపడి మరీ విగ్రహాలు కొనుగోళ్లు చేశారు. దీంతో విగ్రహాలకు డిమాండ్ పెరిగింది.మరోవైపు భారీ విగ్రహాలు ఏర్పాటుతో హైలెట్ అవ్వాలని తపిస్తున్న నిర్వాహకులు అంతకు మించి అన్నట్లుగా కొలువు తీర్చి ఆకట్టుకుంటున్నారు.గాజువాకలో భక్తుల చేత పూజలందుకునెందుకు సిద్ధమవుతున్నారు.దింతో అక్కడ ఒక్కరోజు ముందుగానే వినాయక చవితి సందడి నెలకొంది.

## ఉదయస్తుమన సేవను, ప్రదోషకాల సేవను ప్రారంభించిన శ్రీశైల దేవస్థానం

శ్రీశైలం శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం ప్రతిష్టాత్మకంగా ఉదయాస్తమాన సేవ,ప్రదోషకాలసేవలను ప్రారంభించింది. శ్రీశైలం మహా క్షేత్రంలో స్వామి అమ్మవార్ల సన్నిధానంలో జరిగే నిత్య కైంకర్యాలతో పాటు భక్తుల సౌకర్యం పలు ఆర్థిక సేవలు నిర్వహించడం జరుగుతుంది ఈ సేవలన్నీ ఆలయంలో ఒకరోజులో జరిపే అన్ని సేవలను ప్రాతఃకాలంలో ఆలయ ద్వారాలు తెరిచిన మొదలు తిరిగి రాత్రి ఆలయ ద్వారాలు మూసేంతవరకు సుప్రభాతం నుండి ఏకాంత సేవ వరకు మొత్తం 14 సేవలలో భక్తులు పాల్గొనే విధంగా ఉదయస్థ మానసేవను దేవస్థానం ప్రవేశపెట్టింది. భక్తులు ఈ సేవను ఉపయోగించుకుంటూ గాను 1,01,116 రూపాలను దేవస్థానం వెబ్ సైట్ బతీతిబజీతిశ్రీజీఎ టవలజీబబిష్త్రజీనిజీఎ.నీతీణ నందు టికెట్ చెల్లించి ఈ సేవను చేసుకొనవలసి ఉంటుంది. వచ్చేనెల 5 నుండి ఈ సేవలు భక్తులకు అందుబాటులో రానున్నాయని కార్యనిర్వాణాఅధికారి ఎన్ లవన్న తెలియజేశారు. ఈరోజు సాయంత్రం భక్తులకు టికెట్లను జారీ చేసే విధంగా ప్రత్యేక పూజాదికాలను కార్యనిర్వాహక భవన సమావేశం మందిరం నందు అర్చకులచే నిర్వహించి స్విచ్ ఆన్ చేసి టికెట్లను భక్తులకు సౌకర్యం ఆన్లైన్ ద్వారా భక్తులకు అందుబాటులో ఉంచారు. ఈ ఉదయ స్తంభాల సేవతోపాటు ప్రదోషకాల సేవను కూడా ప్రారంభించారు. ఈ రెండు సేవలకు గాను ప్రతిరోజు 6 టికెట్లు మాత్రమే ఆన్లైన్లో అందుబాటులో ఉంటాయని ఉదయాస్తుమానసేవలో భాగంగా 14 రకాల పూజలు చేసుకునే విధంగాను ప్రదోషకాల సేవకు 25,116 రూపాయలు చెల్లించి ఉదయం నుండి సాయంత్రం వరకు 4 సేవా పూజలను చేసుకునే విధంగా ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో లవన్న తెలిపారు. ఈ పూజలో పాల్గొనే భక్తులకు వసతి నుండి భోజనము అన్ని పూజలు లడ్డు ప్రసాదాలు భార్యాభర్తల ఇరువురికి పట్టు పంచ పట్టు రవిక దేవస్థానం చిత్రపటం మొదలగు వాటిని భక్తులకు అందిస్తారు.

## చదువుతోనే సామాజిక చైతన్యం

కడప చదువు తోనే సామాజిక చైతన్యం, అభివృద్ధి జరుగుతుందని లైన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ లయన్ కె చిన్నప రెడ్డి అన్నారు గత సోమవారం ప్రొద్దుటూరు లో వయోభేదం లేకుండా చదువు నేర్చుకుంటున్న వారిని చిన్నపరెడ్డి బృందం సందర్శించింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నిరుద్యోగి అయినప్పటికీ తను చదువుకున్న ఉన్నత విద్యను 10 మందికి పరోపకార దృష్టితో పనిచేస్తున్న తవ్వా వెంకటయ్య కృషి అభినందనీయమన్నారు వెంకటయ్య పది మందికి స్ఫూర్తిదాయకంగా కొనసాగాలని సూచించారు35 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల మధ్య ఉన్న వయోజనులకు ప్రొద్దుటూరు కేంద్రంగా డా. తవ్వా వెంకటయ్య తెలుగు నేర్పిస్తున్నాడు. సుమారుగా 15 మందికి దినసరి కూలీలుగా ఉన్న వారికి ప్రొద్దుటూరులో ప్రతి వారం శుక్రవారం నాడు మధ్యాహ్నం రోజు వారికి తెలుగు నేర్పిస్తున్నాడు. కేవలం 12 రోజులలో తెలుగు నేర్పడే లక్ష్యంగా తవ్వా వెంకటయ్య అక్షరయజ్ఞం ప్రారంభించాడన్నారు . ఇప్పటికి సుమారుగా వారం రోజులుగా చదువు చెప్పడం జరుగుతోందన్నారు ఇది నిరంతరాయంగా సాగడం హర్షణీయమన్నారు .దీనికి విశేష స్పందన లభిస్తుందని చెప్పారు . చదువు నేర్చుకుంటున్న వారిని ప్రోత్సహించి వారికి తెలుగు భాష దినోత్సవ సందర్భంగా పోతుల వెంకట్రామి రెడ్డి,లైన్స్ క్లబ్ తరఫున రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు తరఫున బట్టలు బహుమతిగా ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా తవ్వా వెంకటయ్యను ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో తెలుగు భాష నేర్పడం కోసం చేసే కృషి వెనకాల తాము ఉంటామని లయన్ కె. చిన్నపరెడ్డి ప్రోత్సహించారు

## కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని ధర్నా

అరకులోయ అల్లూరి సీతారామరాజు జిల్లా లోఅరకులోయ పద్మాపురం, కొత్తవలస,చింతపల్లి హెచ్.ఎన్.టీ.సీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో పద్మాపురం గార్డెన్ గేటు ముందు ధర్నా నిర్వహించారు.సిఐటియు మండల కార్యదర్శి పి బాలదేవ్ మాట్లాడుతూ హెచ్ ఎన్ టీ సీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని అనేకమార్లు ఐటిడిఏ పి ఓ కు కలిసి సమస్యలు చెప్పుకున్న పరిష్కారం చేయలేదని 2022 జూలై ఆగస్టు నెలల జీతాలు చెక్కు చేతికిచ్చి అకౌంట్ లో డబ్బులు లేకుండా చేసిన ఐటీడీఏ పిఓను ప్రభుత్వం తక్షణమే చర్య తీసుకోవాలని, 2021 మూడు నెలల బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని, 2010-నుండి 2012కార్మికుల నుండి వసూలు చేసిన ఈపీఎఫ్ డబ్బులు వారిఖాతాలోజమ చేయాలని, కనీసవేతనం 26వేలుఇవ్వాలని కోరారు.

## ఆగిన జిల్లా పరిషత్ పాఠశాల వసతిగృహం

### పరిశీలించిన గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర

పెదబయలుఅల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలో గత తెలుగుదేశం ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలన్నిటిలో బీసీ హాస్టల్స్ నిర్మాణం చేయాలని ఒక్కొక్క వసతి గృహ నిర్మాణానికి కోటి 50 లక్షలు పైచిలుకు నిధులు కేటాయించడం జరిగిందని. ఇందులో భాగంగానే గిరిజన ప్రాంతంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బీసీ హాస్టల్ నిర్మాణం చేపట్టాలని ఏడాది క్రితం సీతగుంట సమీప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం వద్ద పనులు మొదలు పెట్టీ మధ్య లో పనులు మానివేసి నేటికీ ఏడాది గడిచిన ఎందువల్ల హాస్టల్ నిర్మాణ పనులు ఆగిపోయిందో అధికారుల నుండి ఎటువంటి స్పందన లేకపోవడం దారుణమని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్ల సురేంద్ర అన్నారు. గతం లో ఉన్న వసతి గృహనీ కూల్చివేసి విద్యార్థులకు హాస్టల్ లేకుండా చేశారని దీనివల్ల వసతి లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.కావున ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఆగిపోయిన వసతి గృహ నిర్మాణాలను పునర్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# అక్రమ నాటుసారా,అక్రమ మద్యంపై విస్తృత దాడులు

## జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్



కర్నూలు, ఆగస్ట్ 30: అక్రమంగా నాటుసారా తయారీ,నిల్వ,అక్రమ మద్యం,అక్రమ రవాణా, అమ్మకాలపై గత వారం రోజులుగా జిల్లా పోలీసు యంత్రాంగం,సెబ్ అధికారులు,స్పెషల్ పార్టీ పోలీసులు,సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి విస్తృతంగా దాడులు చేశారని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తెలిపారు.ఈ మేరకు మంగళవారం వివరాలు వెల్లడించారు.జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలనకు జిల్లా పోలీసులు సమిష్టిగా నాటుసారా స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించడం జరిగిందన్నారు.నాటుసారా తయారుచేసే 21 గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు.విస్తృత దాడులలో (ఆగష్టు 23 నుండి 29 వరకు) గత వారం రోజుల నుండి నిర్వహించిన నాటుసారా పై విస్తృతంగా దాడులు.నాటుసారా పై 20 కేసులు,22 మంది అరెస్టు,366 లీటర్ల నాటుసారా సీజ్,3,745 లీటర్ల నాటు సారా బెల్లం ఊటను ధ్వంసం,769 కేజీల బెల్లం సీజ్,5 వాహనాలు సీజ్ చేయడం జరిగిందని అన్నారు. అక్రమ(తెలంగాణ, కర్ణాటక) మద్యం రవాణపై దాడులు...అక్రమ మద్యం పై 24 కేసులు,26 మంది అరెస్టు, 358.7 లీటర్ల మద్యం సీజ్,7 వాహానాలు సీజ్, బైండ్ ఓవర్ కేసుల్లో నాటు సారాపై 52 మందిని బైండోవర్ చేయడం జరిగింది.అక్రమ మద్యంపై 7 మంది ని బైండ్ ఓవర్ చేయడం జరిగింది. షరతులను ఉల్లంఘించిన ఒకరి (బ్రీచ్ అఫ్ బాండ్)పై బాండ్ జప్తు చేసి రూ.15 వేల జరిమానా విధించడం జరిగింది.ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖజనాకు జమ చేయడం జరిగిందన్నారు. నాటుసారా పై విస్తృతంగా గ్రామాలలో ఆర్ ఎస్పై,12 మంది స్పెషల్ పార్టీ పోలీసులచే దాడులు చేస్తున్నామన్నారు.ప్రజారోగ్యానికి హాని కలిగించే అక్రమ నాటుసారా తయారీ,అక్రమంగా మద్యం రవాణా, విక్రయాలకు పలుమార్లు పాల్పడే వ్యక్తులపై పిడి యాక్టులు కూడా నమోదు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఈ సంధర్భంగా తెలిపారు.

# గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



కౌతాళం, :-కందనవోలు మంత్రాలయం నియోజవర్గం కౌతాళం మండలం మలనాటి గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఈ 3 సంవత్సరాలలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించిన కర్నూలు జిల్లా అధ్యక్షులు మంత్రాలయం ఎమ్మెల్యే వై బాల నాగిరెడ్డి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన నాయకులు వై ప్రదీప్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి అందించినటువంటి నవరత్నాల గురించి ప్రజలకు చెప్పడం జరిగింది అలాగే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఈ పథకాలు అందుతాయని ప్రజలకు తెలియజేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భాష్యం స్కూల్లో ముందస్తు వినాయక చవితి వేడుకలు

ఎమ్మిగనూరు-ఎమ్మిగనూరు పట్టణంలోని భాష్యం ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో ముందస్తు వినాయక చవితి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి,ముందుగా పిల్లలు తయారుచేసిన మట్టి



వినాయక విగ్రహాలు పెట్టి పూజలు చేశారు,ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ మట్టితో చేసిన గణపతి విగ్రహాన్ని పూజించడం వలన కరువు కాటకాలు రాకుండా పంటలు సంవృదిగా పండుతాయని ప్రతిదీ,అలాగే మనం మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొవటం వల్ల కాలుష్యాన్ని నివారించి పర్యావరణను కాపాడినవారం అవతామని చెప్పారు. ప్రతి ఒక్కరు వినాయక చవితి వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం పిల్లలకు మట్టి వినాయక విగ్రహాలను ప్రిన్సిపాల్ అందచేశారు,ఈ కార్యక్రమంలో చాంప్స్ ఇంచార్జ్ అనూరాధ, అధ్యాపక బృందం, ఆద్యాపకేతర బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్

కర్నూలు, ఆగస్ట్ 30: వినాయక చవితి సందర్భంగా జిల్లా ప్రజలందరికీ



రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి మరియు జిల్లా ఇంఛార్జి మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జిల్లా కలెక్టర్ పి కోటేశ్వం రావు, జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియ జేశారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజలందరికీ సకల శుభాలూ కలగాలని, వినాయక చవితి పండుగ ను తమ కుటుంబ సభ్యుల తో ఆనందంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు

# అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్



నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలోని ఒకటవ అంగన్ వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ పేద నవజాత శిశువులు, గర్భిణీ స్త్రీలు, బాలింతల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్వాడి కార్యకర్తలను, సూపర్వైజర్లను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలోని చంటి పిల్లల ఎదుగుదల మానిటరింగ్ రిజిస్టర్ ను పరిశీలిస్తూ... అందుబాటులో ఉన్న పిల్లల బరువును తూకం వేసి చూపించడాన్ని కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్దేశిత ఆదేశాల ప్రకారం అంగన్వాడి కేంద్రాన్ని వినూత్న రీతిలో ఆదర్శంగా తీర్చిదిద్ది జిల్లా అంతటా ప్రవేశపెట్టేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతిని కలెక్టర్ ఆదేశించారు. గర్భవతులు, బాలింతల్లో రక్తహీనతను నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్వాడి కార్యకర్తలను కలెక్టర్ ఆదేశించారు. నంద్యాల అర్బన్ సిడిపిఓ ఉషారాణి, సూపర్వైజర్ విజయలక్ష్మి తదితరులు తనిఖీలో పాల్గొన్నారు.

# మళ్లీ రికార్డులు కొట్టే సత్తా ప్రభాస్ కే ఉంది



ఇప్పటివరకూ 2022 లో అసాధారణ విజయాలు సౌత్ నుంచి నమోదయ్యాయి. ఆర్.ఆర్.ఆర్- కేజీఎఫ్ 2- పుష్ప- మేజర్- కార్తికేయ 2 సౌత్ విలువను పెంచాయి. నార్త్ లో భూల్ భులయా 2 - కాశ్మీర్ ఫైల్స్ తర్వాత మళ్లీ అలాంటి విజయాలు కనిపించలేదు. ఎన్నో అంచనాల నడుమ విడుదలైన అమీర్ ఖాన్ లాల్ సింగ్ చడ్డా.. అక్షయ్ కుమార్ రక్షా బంధన్ తీవ్రంగా నిరాశపరిచాయి. మునుముందు రణబీర్ కపూర్ నటించిన బ్రహ్మాస్త్ర భారీ అంచనాల నడుమ విడుదలవుతోంది. ఇది దేవుళ్ల ఫిక్షన్ నేపథ్యంలో భారీ విజువల్ గ్రాఫిక్స్ నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఈ మూవీపై కపూర్ అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. అయితే ఇది సౌత్ లో ఏమేరకు రాణిస్తుంది? అన్నది ఇప్పుడే చెప్పలేం.ఇంతకుముందు టీజర్.. ట్రైలర్ కి సౌత్ నుంచి తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. తెలుగులో విడుదలైన కొన్ని పాత సినిమాలను (శక్తి- అంజి- ఢమరుకం) సినిమాలను ఉదాహరణలుగా చూపిస్తూ క్రిటిసైజ్ చేయడం చూశాం. అందుకే బ్రహ్మాస్త్ర అద్భుతాలు చేయాలంటే కంటెంట్ పరంగా ఇన్ డెప్త్ ఎలిమెంట్స్ తో మిరాకిల్స్ చేసేందుకు దర్శకుడు ప్రయత్నించాల్సి ఉంటుంది.అయితే సంక్రాంతి బరిలో వస్తున్న ఆదిపురుష్ 3డిపై ఇలాంటి నెగెటివ్ సెన్స్ ఇప్పటివరకూ లేదు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ఈ సినిమాని రామాయణం స్ఫూర్తితో తెరకెక్కిస్తున్న ఓంరౌత్ అందులో పాత్రలను పురాణాల టచ్ తో అలాగే జనరేషన్ ఛేంజ్ తో.. అంటే నేటి ట్రెండ్ కి అనుగుణంగా సృజించడంతో కనెక్టివిటీ ఎలిమెంట్ పరంగా సమస్య లేకుండా జాగ్రత్త పడ్డారని విశ్లేషిస్తున్నారు. అలాగే ఈ మూవీ విజువల్ గ్రాఫిక్స్ బెంచ్ మార్క్ ని ఆవిష్కరిస్తాయన్న గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. శ్రీరాముని శక్తి యుక్తులను గొప్పతనాన్ని ఆవిష్కరిస్తూనే సీతాదేవి(కృతి సనోన్) కథను అద్భుతంగా తెరపైకి తెస్తున్నారని కూడా చెబుతున్నారు. అయితే ఈ కథను నేటి జనరేషన్ కి ఎలా కనెక్ట్ చేశారన్నదానిపై సరైన హింట్ ఇంకా రివీల్ కాలేదు. ఇక ఇందులో రావణుడిగా నటిస్తున్న సైఫ్ పాత్రను భీకర విలనీతో తెరపైకి తెస్తున్నారని సమాచారం. ప్రభాస్ - సైఫ్ (శ్రీరామ- రావణ) మధ్య పోరాట దృశ్యాలు మరో లెవల్లో ఆవిష్కరిస్తున్నారని అయితే ఈ మూవీకి సంబంధించి ఎలాంటి లీకులు లేకుండా ఓంరౌత్ జాగ్రత్త పడడం వల్లనే ఇప్పటివరకూ లీకులేవీ అందలేదని కూడా టాక్ వినిపిస్తోంది.బాహుబలి ఫ్రాంఛైజీతో బెంచ్ మార్క్ క్రియేట్ చేసిన ప్రభాస్ ఆ తర్వాత కూడా సాహో లాంటి యాక్షన్ సినిమాతో ఉత్తరాది బెల్ట్ లో ఘనవిజయం అందుకున్నాడు. అందువల్ల ఆదిపురుష్ 3డికి కూడా అలాంటి మరో అరుదైన అవకాశం లభిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. ట్రేడ్ లోనూ ఆ మేరకు బజ్ ఉంది. తానాజీ చిత్రాన్ని 3డిలో ఓంరౌత్ ఆవిష్కరించిన తీరు ఆ సినిమా సాధించిన విజయం కూడా ఆదిపురుష్ 3డికి బజ్ పెంచేందుకు దోహదపడనుంది. ఇకపోతే ఈ మూవీ టీజర్.. ట్రైలర్ రాకతో మరింతగా హైప్ పెరిగేందుకు ఛాన్సుంటుంది. ఈనెలలోనే ఫస్ట్ లుక్ విడుదలవుతోంది. ఇక రికార్డుల పరంగా 1000 కోట్ల క్లబ్ ని ప్రభాస్ మరోసారి రిపీట్ చేస్తాడా లేదా? అన్నది వేచి చూడాలి. బ్రహ్మాస్త్ర ఈ నెలలో విడుదలవుతోంది. ఆ తర్వాత 2023 సంక్రాంతి బరిలో వస్తున్న భారీ బడ్జెట్ చిత్రమిది. అందువల్ల అంచనాలు తారా స్థాయికి చేరుతున్నాయి.

# టాక్.. ఆఖరి దశకు చేరుకుంటున్న 'ఆర్సీ 15'!?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఇండియన్ స్టార్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్ లో ఓ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. చరణ్ కు ఇది 15వ ప్రాజెక్ట్ కావడంతో.. 'ఆర్సీ 15' వర్కింగ్ టైటిల్ తో ఈ మూవీని రూపొందిస్తున్నారు. పొలిటికల్ బ్యాక్ డ్రాప్ లో యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బిజీ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తోంది.లాగే అంజలి శ్రీకాంత్ జయరామ్ సునీల్ నవీన్ చంద్ర తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు. మ్యూజిక్ సెన్సేషన్ తమన్ స్వరాలు సమకూర్చుతున్నారు. ఇప్పటికే యాబై శాతానికి పైగా షూటింగ్ ను కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రానికి కాస్త



బ్రేక్ వచ్చింది. అయితే ఈలోపే 'ఆర్సీ 15' ఆగిపోయిందంటూ ప్రచారాలు మొదలయ్యాయి.అందుకు కారణం లేకపోలేదు.. మధ్యలో ఆగిపోయిన తన లాస్ట్ ప్రాజెక్ట్ 'ఇండియన్ 2'పై డైరెక్టర్ శంకర్ మళ్లీ దృష్టి సారించారు. షూటింగ్ ను రీస్టార్ట్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో శంకర్ 'ఆర్సీ 15'ను కొన్నాళ్లు పక్కన పెట్టేయబోతున్నాడంటూ వార్తలు పుట్టుకొచ్చాయి. ఈ వార్తలు చరణ్ అభిమానులను ఎంతగానో కలవర పెట్టాయి. అయితే ఆ వార్తలు కేవలం పుకార్లే అని శంకర్ తేల్చేశారు.ఈ మేరకు 'హాయ్.. ఎవ్రీ వన్.. ఇండియన్ 2 ఆర్సీ 15 రెండు కూడా ఒకేసారి షూటింగ్ జరుగుతాయి.. సెప్టెంబర్ ఫస్ట్ వీక్లో హైదరాబాద్ వైజాగ్ లో ఆర్సీ 15 షూటింగ్ కు రెడీగా ఉండండి..' అంటూ శంకర్ ట్వీట్ చేశారు. ఇదిలా ఉంటే.. తాజాగా 'ఆర్సీ 15'కు సంబంధించి మెగా అభిమానులు ఖుషీ అయ్యే ఓ క్రేజీ టాక్ బయటకు వచ్చింది.అదేంటంటే.. ఈ సినిమా చిత్రీకరణ ఆఖరి దశకు చేరుకుంటోంది. ఈ మూవీ నెక్ట్స్ షెడ్యూల్ ను సెప్టెంబర్ 2 నుంచి ప్రారంభించబోతున్నారట. ఇందుకు మేకర్స్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారట. ఈ షెడ్యూల్ కంప్లీట్ అయ్యేసరికి ఆల్ మోస్ట్ 90 శాతం షూటింగ్ పూర్తయిపోతుందని.. అక్టోబర్ నాటికి సినిమా మొత్తాన్ని కంప్లీట్ చేసేస్తారని టాక్ నడుస్తోంది. ఇక అతి త్వరలో టైటిల్ మరియు ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా లాంఛ్ చేయబోతున్నారని అంటున్నారు.కాగా వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై ప్రముఖ బడా నిర్మాతలు దిల్ రాజు శిరీష్ భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సమ్మర్ కానుకగా ఈ సినిమా విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. అలాగే ఇందులో చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నాడని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది.

# విఘ్నాలు తొలగించే నాయకుడు వినాయకుడు

### -నీలాపనిందలు పోగొట్టే వినాయక వ్రతకథ
### -ఏ కార్యక్రమం చేపట్టినా తొలి పూజ గణేశుడికే



**వినాయకుడి పుట్టిన రోజైన 'భాద్రపద శుద్ధ చవితి' రోజునే 'వినాయక చవితి' పండుగను హిందువులు జరుపుకుంటారు. ఆ రోజునే వినాయకుడు పుట్టాడని.. గణాధిపత్యం పొందాడని పలు పురాణ కథలు ప్రచారంలో ఉన్నాయి. వినాయక వ్రతం, పూజా విధానం ఎలా చేయాలో నా మిత్రుడు, మంథని కి చెందిన వేదపండితులుచెబుతున్నారు.**

వినాయక చవితి రోజున ప్రాతఃకాలమే లేచి ఇంటిని శుభ్రం చేయాలి. తర్వాత తలంటు స్నానం చేసి ఉతికిన వస్త్రాలను ధరించాలి. మామిడాకులు తోరణాలు కట్టి, ఇంటిని అలంకరించారు. ఓ పీటకు పసుపు రాసి ఇంటికి ఈశాన్య భాగంలో లేదా ఉత్తర దిక్కులో ఉంచాలి. ఓ పళ్లెంలో బియ్యంవేసి వాటిపై తమలపాకులు పెట్టుకోవాలి. అగరువత్తులు వెలిగించి, దీపారాధన తర్వాత..'ఓం దేవీంవాచ మజనయంత దేవాస్తాం విశ్వరూపా: పశవో వదంతిసానో మంద్రేష మూర్జం దుహానాధే నుర్వాగాస్మానుప సుష్టుతైత్తు అయం ముహూర్తస్సుముహూర్తోస్తు'శ్లోకం: య శ్శివో నామరూపాభ్యాం యా దేవీ సర్వ మంగళా తయో స్సంస్మరణా త్సుంసాం సర్వతో జయమంగళం అని చదవాలి. పీటపై వినాయక ప్రతిమను ఉంచి, పాలవెల్లికి పసుపు రాసి, కుంకుమతో బొట్టు పెట్టి విగ్రహం తలపై వచ్చేలా దాన్ని వేలాడదీయాలి. దీనిపై పత్రి వేసి నలువైపులా మొక్కజొన్న పొత్తులు, పళ్లతో అలంకరించాలి. ఉండ్రాళ్లు, కుడుములు, పాయసం, గారెలు, పులిహోర, మోదకులు, జిల్లెడుకాయలు మొదలైన పిండివంటలు సిద్ధం చేసుకోవాలి. రాగి లేదా ఇత్తడి పాత్రను తీసుకుని పసుపు రాసి, అందులో నీళ్లువేసి, పైన టెంకాయ, జాకెట్టు ఉంచి కలశం ఏర్పాటు చేయాలి.పూజకు కావాల్సిన సామాగ్రిపసుపు, కుంకుమ, గంధం, అగరవత్తులు, కర్పూరం, తమలపాకులు, పూలు, అరటిపండ్లు, కొబ్బరికాయలు, బెల్లం, తోరం, కుందులు, నెయ్యి, నూనె, వత్తులు, 21 రకాల పత్రి, ఉద్ధరిణ, నైవేద్యాలు.పూజా విధానం..ఓం కేశవాయ స్వాహాః, ఓం నారాయణాయ స్వాహాః, ఓం మాధవాయ స్వాహాః అని మూడుసార్లు చేతిలో నీరు వేసుకొని ఆచమనం చేసుకోవాలి. అనంతరంఈ కింది శ్లోకాలను ఉచ్చరించాలి. గోవిందాయ నమః, విష్ణవే నమః, మధుసూదనాయ నమః, త్రివిక్రమాయ నమః, వామనాయ నమః, శ్రీధరాయ నమః, హృషీకేశాయ నమః, పద్మనాభాయ నమః, దామోదరాయ నమః, సంకర్షణాయ నమః, వాసుదేవాయ నమః, ప్రద్యుమ్నాయ నమః, అనిరుద్ధాయ నమః, పురుషోత్తమాయ నమః, అధోక్షజాయ నమః, నారసింహాయ నమః, అచ్యుతాయ నమః, ఉపేంద్రాయ నమః, హరయే నమః, శ్రీ కృష్ణాయ నమః, శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమఃఈ కింది మంత్రాన్ని చెబుతూ కుడి చేతితో అక్షంతలు దేవునిపై చల్లాలి.ఓం శ్రీలక్ష్మీ నారాయణాభ్యాం నమః, ఓం ఉమామహేశ్వరాభ్యాం నమః, ఓం వాణీ హిరణ్యగర్భాభ్యాం నమః, ఓం శచీపురందరాభ్యాం నమః, ఓం అరుంధతీ వశిష్ఠాభ్యాం నమః, ఓం శ్రీ సితారామాభ్యాం నమః, నమస్సర్వేభ్యోం మహాజనేభ్యః అయం ముహూర్తస్సుముహూర్తోస్తభూతోచ్చాటనఉత్తిష్టంతు భూతపిశాచాః ఏతే భూమి భారకాః ఏతాషామవిరోధేనబ్రహ్మకర్మ సమారభే అనే మంత్రాన్ని చదువుతూ అక్షతలు తలపై నుంచి వెనుక వేసుకొవాలి.ప్రాణాయామం: ఓం భూః, ఓం భువః, ఓగ్ సువః, ఓం మహాః, ఓం జనః, ఓం తపః, ఓగ్ సత్యం, ఓం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్, ఓమాపోజ్యోతీరసోమృతం బ్రహ్మభూర్భువస్సువరోమ్అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాంగతోపినా యః స్మరేద్వై విరూపాక్షంస బాహ్యాభ్యంతరశ్శుచిః అని నాలుగు దిక్కులా ఉద్ధరనితో నీళ్లు చల్లి శుద్ధిచేయాలి. సంకల్పం:మమ ఉపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం శుభేశోభనే ముహూర్తే, శ్రీ మహావిష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య అద్య బ్రాహ్మణ: ద్వితీయపరార్ధే, శ్వేతవరాహకల్పే, వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమపాదే, జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే, మేరోర్దక్షిణదిగ్భాగే, ??.. నదీ సమీపే??? ( శ్రీ శైలస్య) నివాసిత గృహే అస్మిన్ వర్తమాన వ్యావహారిక, చాంద్రమానేన శ్రీ వికారినామ సంవత్సరే, దక్షిణాయనే, వర్ష ఋతౌ, (భాద్రపద) మాసే, (శుక్ల) పక్షే, (చతుర్థ్యాం) తిథి ఇందు వాసరే, శుభ నక్షత్రే, శుభయోగే శుభకరణే, ఏవంగుణ విశేషణ విశిష్టాయాం, శుభతిథౌ శ్రీమాన్???? గోత్ర: ???.నామధేయ (వారివారి గోత్రం, పేరు చదువుకోవాలి) ధర్మపత్నీ?????? సమేతోహం సకుటుంబస్య క్షేమస్థైర్య విజయ అభయ ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధ్యర్థం, ధర్మార్ధ కామ మోక్ష చతుర్విధ ఫల పురుషార్ధ సిద్ద్యర్థం, పుత్రపౌత్రాభివృద్ధ్యర్థం సకలకార్యేషు సర్వదా దిగ్విజయసిద్ధ్యర్థం, శ్రీ వరసిద్ధి వినాయక దేవతా ముద్దిస్య శ్రీ వరసిద్ధి వినాయక దేవతాపూజాం కరిష్యే అదౌ నిర్విఘ్న పరిసమాప్త్యర్థం శ్రీ మహాగణాధిపతి పూజాం కరిష్యే అంటూ కుడిచేయి ఉంగరం వేలితో నీళ్లు ముట్టుకోవాలి.భవసంచిత పాపౌఘ విధ్వంసన విచక్షణమ్ విఘ్నాంధకార భాస్వంతం విఘ్నరాజ మహాంభజేఏకదంతం శూర్పకర్ణం గజవక్త్రం చతుర్భుజం పాశాంకుశధరం దేవమ్ ధ్యాయేత్సిద్ధి వినాయకమ్ ఉత్తమం గణనాథస్య వ్రతం సంపత్కరం శుభం భక్తాభీష్టప్రదం తస్మాత్ ధ్యాయేత్తం విఘ్ననాయకం.షోడశోపచార పూజధ్యాయేత్గజాననం దేవం తప్తకాంచనసన్నిభం, చతుర్భుజం మహాకాయం సర్వాభరణ భూషితం. శ్రీ మహా గణాధిపతయే నమః ధ్యాయామిఅత్రాగచ్ఛ జగద్వంద్య సురరాజార్చితేశ్వర అనాథనాథ సర్వజ్ఞ గౌరీగర్భ సముద్భవ.. ఆవాహయామి: మౌక్తికైః పుష్యరాగైశ్చ నానారత్నైర్విరాజితం రత్నసింహా సనంచారు ప్రీత్యర్థం ప్రతి గృహ్యతాం.. ఆసనం సమర్పయామి:గౌరీపుత్ర నమస్తేస్తు శంకర ప్రియనందన గృహాణార్ఘ్యం మయాదత్తం గంధ పుష్పాక్షతైర్యుతం.. పాద్యం సమర్పయామి:అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ వరపూజిత గృహాణాచమనం దేవ, తుభ్యం దత్తంమయా ప్రభో.. ఆచమనీయం సమర్పయామి: దధిక్షీర సమాయుక్తం థామద్వాజ్యేన సమన్వితం మధుపర్కం గృహాణేదం గజవక్త్రం నమోస్తుతే.. మధుపర్కం సమర్పయామి:స్నానం పంచామృతైర్దేవ గృహాణ గణనాయక అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ గణపూజిత.. పంచామృత స్నానం సమర్పయామి:గంగాదిసర్వతీర్థేభ్యః ఆహృతైరమలిర్ణలైః స్నానం కురుష్వభగవానుమాపుత్ర నమోస్తుతే.. శుద్దోదక స్నానం సమర్పయామి: రక్తవస్త్రద్వయం చారు దేవయోగ్యంచ మంగళం శుభప్రదం గృహాణత్వం లంబోదరహరాత్మజ..వస్త్రయుగ్మం సమర్పయామి:రాజితం బహ్మసూత్రంచ కాంచనం చో త్తరీయకం గృహాణ సర్వదేవజ్ఞ భక్తానామిష్టదాయక.. యజ్ఞోపవీతం సమర్పయామి:చంద నాగరు కర్పూర కస్తూరీ కుంకుమాన్వితం విలేపనం సురశ్రేష్ఠ ప్రీత్యర్థం ప్రతిగృహ్యతాం.. గంధాన్ సమర్పయామి:అక్షతాన్ ధవళాన్ దివ్యాన్ శాలీయాంస్తండులాన్ శుభాన్, గృహాణ పరమానంద ఈశపుత్ర నమోస్తుతే.. అక్షతాన్ సమర్పయామి:సుగంధాని సుపుష్పాణి జాజీకుంద ముఖానిచ ఏక వింశతి పత్రాణి సంగృహాణ నమోస్తుతే.. పుష్పాణి పూజయామి:అథాంగ పూజ.. పుష్పాలతో పూజించాలి.గణేశాయ నమః - పాదౌ పూజయామిఏకదంతాయ నమః - గుల్ఫౌ పూజయామిశూర్పకర్ణాయ నమః - జానునీ పూజయామివిఘ్నరాజాయ నమః - జంఘే పూజయామిఅఖువాహనాయ నమః - ఊరూ పూజయామిహేరంబాయ నమః - కటిం పూజయామిలంబోదరాయ నమః

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190